

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి | బుధవారం 19 జనవరి 2022 | సంపుటి:03 | సంచిక:140 | పేజీలు:4 | వెల: రూ 3-00


## ఇకపై డూప్లికేట్ రిజిస్ట్రేషన్లకు చెక్: సీఎం జగన్



అమరావతి: ఇకపై డూప్లికేట్ రిజిస్ట్రేషన్లకు చెక్ పెడతామని.. దళారీ వ్యవస్థ రద్దు అవుతుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన 37 గ్రామాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సేవలను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తాన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గ్రామ కంఠాల్లోని స్థిరాస్తుల సర్వే, యాజమాన్య ధ్రువీకరణ పత్రాలు ఇస్తామని.. అన్ని గ్రామ సచివాలయాల్లోనే స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు.వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా మంచి కార్యక్రమానికి మళ్లీ ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. దేశంలో తొలిసారిగా అత్యంత శాస్త్రీయ పద్దతిలో సమగ్ర భూసర్వే తొలి దశలో 51 గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామన్నారు. 11,501 గ్రామాల్లో డిసెంబర్ 2022 నాటికి రీసర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ రోజు నుంచి 37 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వివాదాలకు తావు లేకుండా సమగ్ర సర్వే చేపట్టామన్నారు. మీ ఆస్తులు లావాదేవీలు మీ గ్రామంలో కనిపించే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఇటువంటి మంచి సంస్కరణ నేటి నుంచి అమల్లోకి తెస్తున్నామని సీఎం అన్నారు."భూములకు సంబంధించి ట్యాంపరింగ్ జరుగుతోందన్న ఫిర్యాదులు వచ్చాయి. పట్టాదారు పాస్ బుక్‌లకు ఆశించినంత లాభం జరగలేదు. భూమికి చెందిన నిర్ధిష్టమైన హద్దులు, హక్కులు ఇప్పటివరకు లేవు. కేవలం 90 శాతం కేసులు సివిల్ వివాదాలకు సంబంధించినవే.. శాస్త్రీయ పద్దతుల్లో భూములకు నిర్ధిష్టంగా మార్కింగ్ చేసి ప్రతి ఒక్కరికీ ఐడెంటిఫికేషన్ నంబర్ ఇస్తే ల్యాండ్ వివాదాలకు చెక్ పెట్టొచ్చు. 2023 కల్లా సమగ్ర రీ సర్వే చేసి యూనిక్ ఐడీ కార్డ్, డేటా అప్‌డేట్ ఇస్తాం. తొలి దశలో 51 గ్రామాల్లోని.. 29,563 ఎకరాల భూముల రీసర్వే చేశాం. ఎమ్మార్వోల ద్వారా భూ యజమానుల అభ్యంతరాలను పరిష్కారం చేశాం. ప్రతి భూ కమతానికి ఉచితంగా భూ రక్ష హద్దు రాళ్లు ఇస్తామని" సీఎం పేర్కొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించిన సీఎం జగన్

గుంటూరు రాష్ట్రవ్యాప్తంగా భూములు, ఆస్తుల రక్షణకు ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు? భూ రక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించిన సమగ్ర భూసర్వే రికార్డులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రజలకు అంకితం చేశారు. అలాగే 37 గ్రామాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సేవలను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా మంచి కార్యక్రమానికి మళ్లీ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సేవల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతూ, దేశంలో తొలిసారిగా అత్యంత శాస్త్రీయ పద్దతిలో సమగ్ర భూసర్వే తొలి దశలో 51 గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామన్నారు. 11,501 గ్రామాల్లో డిసెంబర్ 2022 నాటికి రీసర్వే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ రోజు నుంచి 37 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో వివాదాలకు తావు లేకుండా సమగ్ర సర్వే చేపట్టామన్నారు. మీ ఆస్తులు లావాదేవీలు మీ గ్రామంలో కనిపించే విధంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఇటువంటి మంచి సంస్కరణ నేటి నుంచి అమల్లోకి తెస్తున్నామని సీఎం అన్నారు. భూములకు సంబంధించి ట్యాంపరింగ్ జరుగుతోందన్న ఫిర్యాదులు వచ్చాయి. పట్టాదారు పాస్ బుక్‌లకు ఆశించినంత లాభం జరగలేదు. భూమికి చెందిన నిర్ధిష్టమైన హద్దులు, హక్కులు



ఇప్పటివరకు లేవు. కేవలం 90 శాతం కేసులు సివిల్ వివాదాలకు సంబంధించినవే.. శాస్త్రీయ పద్దతుల్లో భూములకు నిర్ధిష్టంగా మార్కింగ్ చేసి ప్రతి ఒక్కరికీ ఐడెంటిఫికేషన్ నంబర్ ఇస్తే ల్యాండ్ వివాదాలకు చెక్ పెట్టొచ్చు.వందేళ్ల తర్వాత దాదాపు రూ.1,000 కోట్ల ఖర్చుతో 4,500 సర్వే బృందాలు, 70 కార్స్ బేస్ స్టేషన్లు, 2 వేల రోవర్లతో అత్యాధునిక సాంకేతికతను వినియోగించి దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర భూసర్వేను చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మొదటి దశలో 51 గ్రామాల్లోని 12,776 మంది భూ యజమానులకు చెందిన 21,404 భూ కమతాలను అధికారులు రీసర్వే చేశారు. ఇందులో భాగంగా వారికి చెందిన 29,563 ఎకరాల భూములను రీసర్వే చేసి.. 3,304 అభ్యంతరాలను పరిష్కరించారు. ఈ భూమి రికార్డులను సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తారు. జూన్ 2023 నాటికి దశలవారీగా రాష్ట్రంలో మిగిలిన భూముల రీసర్వేను కూడా పూర్తి చేయనున్నారు. తర్వాత రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి ఆయా గ్రామ సచివాలయాల్లో స్థిరాస్తులను రిజిస్ట్రేషన్ చేస్తారు.భూ రికార్డుల ప్రక్షాళన : కమతం ఒక సర్వే నంబర్ కింద ఉండి, కాలక్రమేణా విభజన జరిగి.. చేతులు మారినా సర్వే రికార్డులు అప్‌డేట్ కాకపోవడంతో వస్తున్న భూవివాదాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇబ్బందులకు ప్రభుత్వం ఇక చెక్ పెట్టనుంది. భూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రతి భూ కమతానికి (సబ్ డివిజన్‌కు కూడా) విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించనుంది. ప్రతి భూ కమతానికి విడిగా అక్షాంశ, రేఖాంశాలు, విశిష్ట గుర్తింపు సంఖ్య, సమగ్రంగా భూ వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌తో కూడిన భూపటాన్ని యజమానులకు జారీ చేస్తుంది. గ్రామ స్థాయిలోనే భూరికార్డులను క్రోడీకరించడం వల్ల మ్యాపులు (భూ కమతాలతో కూడిన గ్రామ పటం), ఇతర భూ రికార్డులు ఇక గ్రామాల్లోనే అందుబాటులో ఉంటాయి.శాశ్వత భూ హక్కు : సర్వే ప్రతి అడుగులో భూ యజమానులను భాగస్వాములను చేశారు. మండల మొబైల్ మెజిస్ట్రేట్ బృందాల ద్వారా అభ్యంతరాలను పరిష్కరించారు. ప్రతి భూకమతానికి ఉచితంగా భూరక్ష హద్దు రాళ్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సమగ్ర భూసర్వే పూర్తయిన వాటికి సంబంధించి సింగిల్ విండో పద్ధతిలో ప్రతి ఆస్తికీ ప్రభుత్వ హామీతో కూడిన శాశ్వత భూహక్కు పత్రం జారీ దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది.


## బడ్జెట్ కసరత్తు షురూ...



ముంబై, జనవరి 18, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2022-23 తయారీలో నిమగ్నమయ్యారు. రియల్ ఎస్టేట్, వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్, హెల్త్‌కేర్ రంగాలపై దృష్టి పెట్టుతూ బడ్జెట్ పత్రాలు రెడీ చేస్తున్నారు. ఎందుకంటే ఈ 6 రంగాలు మాత్రమే 2030 నాటికి భారత జీడీపీకి వి6 ట్రిలియన్‌లను జోడించగలవని మెకెంజీ అంచనా వేసింది. భారతదేశంలో ఉపాధి అనేది సామాజిక-ఆర్థిక సమస్య మాత్రమే కాదు. రాజకీయ సమస్య కూడా. కాబట్టి, రాష్ట్రమైనా లేదా జాతీయమైనా దాదాపు ప్రతి ఎన్నికలలో ఉపాధిని కూడా ఎన్నికల అంశంలో చేర్చుతుంటారు. అటువంటి పరిస్థితిలో, భారతదేశంలో లోక్‌సభ ఎన్నికలకు కేవలం 2 సంవత్సరాలు మాత్రమే మిగిలి ఉన్నందున, 2022-23 కోసం కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టడం సహజం. ముఖ్యంగా 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు యువతకు 1 కోటి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపక్ష పార్టీల నుంచి తరచూ ఇబ్బందులకు గురవుతున్నారు.ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వానికి స్వంత వాదనలు ఉంటాయి. ఉద్యోగ కల్పన అనేది ఏ ప్రభుత్వానికైనా ప్రధాన ప్రాధాన్యతలలో ఒకటి అనేది వాస్తవం. 2020 జనవరిలో దేశంలో 7.2శాతం ఉన్న నిరుద్యోగిత రేటు మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుసగా 23.5 శాతం పెరిగింది. తరువాతి నెలల్లో, ఇది 6-7 శాతం శ్రేణికి తిరిగి వచ్చినప్పటికీ, అది మళ్లీ డిసెంబర్ 2020లో 9 శాతం దాటింది. కోవిడ్ సెకండ్ వేవ్ వచ్చినప్పుడు మే-జూన్ 21లో దాదాపు 12 శాతానికి చేరుకుంది.ప్రస్తుతం కోవిడ్ థర్డ్ వేవ్ ప్రారంభంతో, పరిస్థితి మళ్లీ క్షీణించడం ప్రారంభించింది. విడుదల చేసిన తాజా డేటా ప్రకారం, భారతదేశ నిరుద్యోగిత రేటు మరోసారి డిసెంబర్ 2021లో 4 నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. చాలా మంది ఆర్థికవేత్తలు థర్డ్ వేవ్ ఒమిక్రాన్ వేరియంట్‌లు ఆర్థిక పరిస్థితులలో చాలా అవసరమైన పునరుద్ధరణను దెబ్బతీస్తాయని నమ్ముతారు. ఇలాంటి పరిస్థితిలో, 2022-23 సాధారణ బడ్జెట్‌లో పరిశ్రమలను, ఉద్యోగాలను నెలకొల్పడం ప్రభుత్వానికి ఒక అవకాశంగా ఉంటుంది.ఆగస్టు 2020లో, కన్సల్టెన్సీ సంస్థ మెకెంజీ ఒక నివేదికను విడుదల చేసింది. 2030 నాటికి అదనంగా 60 మిలియన్ల మంది భారతదేశ వ్యవసాయేతర కార్మిక మార్కెట్లోకి ప్రవేశిస్తారని, 30 మిలియన్ల మంది ప్రజలు వ్యవసాయ రంగం నుంచి వ్యవసాయేతర రంగానికి మారతారని అంచనా వేసింది. అంటే రానున్న 8 ఏళ్లలో 9 కోట్ల మందికి ఉపాధి కల్పించేందుకు పారిశ్రామిక రంగం సిద్ధం కావాలి. సామాజికంగా, విద్యాపరంగా మహిళా సాధికారత, సమానత్వ పథకాలను సక్రమంగా అమలు చేస్తే వీరితో పాటు అదనంగా 5.5 కోట్ల మంది మహిళలు కూడా ఈ లేబర్ మార్కెట్‌లోకి రావచ్చని నివేదిక పేర్కొంది. ఇది పెద్ద సవాల్ అని, దీని కోసం ప్రభుత్వం ఇప్పటినుంచే ప్రయత్నాలు చేయాలన్నారు.2022-23 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ఈ దిశలో బలమైన ప్రారంభం కాగలదు. ఎందుకంటే భారత ఆర్థిక వ్యవస్థ దాని చెడ్డ దశ నుంచి బయటపడిందని, ఈ మొత్తం 2021-22 సంవత్సరంలో 9 శాతం కంటే ఎక్కువ వృద్ధి చెందుతుందని అన్ని సంకేతాలు సూచిస్తున్నాయి.

## ప్రభుత్వ ఉద్యోగుల డీఏలు విడుదల

### 23 శాతం ఫిట్‌మెంట్




అమరావతి: ఉద్యోగులు, పెన్షనర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేరకు 23 శాతం ఫిట్‌మెంట్‌కు అనుగుణంగా కొత్త పీఆర్సీ అమలుతోపాటు పెండింగ్ డీఏలను విడుదల చేస్తూ ఆర్థికశాఖ సోమవారం వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా సీఎం జగన్ 23 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని, పెండింగ్ డీఏలు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.అందుకనుగుణంగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్ ఉత్తర్వులు జారీచేశారు. పే రివిజన్ కమిషన్ నివేదికపై సీఎస్ అధ్యక్షతన వేసిన కమిటీ చేసిన పలు సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోవిడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ రాబడి కన్నా వేతనాలు, జీతభత్యాల వ్యయం ఎక్కువగా ఉందని సీఎస్ కమిటీ పేర్కొనడంతో.. ఐదేళ్లకొకసారి వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయలేమని, కేంద్ర ప్రభుత్వ విధానాన్ని అమలు చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదికన సీఎస్ కమిటీ సూచించిన మేరకు ఉద్యోగుల ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్ఏ)ను అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 50 లక్షలకు పైబడి జనాభా ఉండే నగరాల్లో పనిచేసే ఉద్యోగులకు బేసిక్ స్కేలుపై 24 శాతం హెచ్‌ఆర్ఏ, 5?50 లక్షల మధ్య జనాభా ఉండే నగరాలు, పట్టణాల్లో పనిచేసే ఉద్యోగులకు 16 శాతం, 5 లక్షల లోపు జనాభా ఉండే పట్టణాలు, గ్రామాల్లో పనిచేసే ఉద్యోగులకు 8 శాతం హెచ్‌ఆర్ఏగా నిర్ధారిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐఏఎస్ అధికారులతో పాటు యూనివర్సిటీలు, అఫిలియేటెడ్ డిగ్రీ కాలేజీలలో యూజీసీ వేతనాలతో పనిచేసే వారికి రివైజ్డ్ హెచ్‌ఆర్ఏ వర్తించదని తెలిపారు.

కన్సాలిడేటెడ్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు కూడా కొత్త పీఆర్సీ అమలు ప్రకారం 23 శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేస్తూ మరో ఉత్తర్వు జారీ చేశారు.

1993 నవంబరు 25వ తేదీకి ముందు ఎన్ఎంఆర్, పార్ట్‌టైం ఉద్యోగులుగా చేరిన వారికి కూడా కొత్త పే స్కేళ్ల ప్రకారం వేతనాలు అమలు చేస్తూ ఇంకో ఉత్తర్వు జారీ చేశారు.

## టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కరోనా పాజిటివ్

### త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్ష

అమరావతి జనవరి 18 తెలుగు రాష్ట్రాల్లో కరోనా విజృంభణ కొనసాగుతోంది. అనేక మంది రాజకీయ నాయకులు, ప్రముఖులు కరోనా బారిన పడుతున్నారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. తాను కరోనా బారిన పడినట్లు బాబు ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం హోంక్వారంటైన్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల తనను కలిసిన వారు కరోనా పరీక్షలు చేసుకోవాల్సిందిగా చంద్రబాబు నాయుడు సూచించారు. చంద్రబాబు తనయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కూడా కరోనా బారిన పడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని నిన్న(సోమవారం) లోకేష్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నానని, అయితే.. ముందు జాగ్రత్త చర్యగా కొవిడ్ తగ్గిపోయే వరకు హోం ఐసోలేషన్‌లో ఉండాలని నిర్ణయించుకున్నట్లు లోకేష్ తెలిపారు. కరోనా బారిన పడిన టీడీపీ అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు త్వరగా కోలుకోవాలని ముఖ్యమంత్రి జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా సీఎం వెల్లడించారు. "చంద్రబాబు గారు త్వరగా కోలుకొని, ఆరోగ్యవంతులుగా తిరిగి రావాలి" అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు, ఆయన కుమారుడు లోకేష్ కూడా కరోనా బారిన పడిన విషయం తెలిసిందే.



## చంద్రబాబు త్వరగా కోలుకోవాలి: పవన్ కల్యాణ్



అమరావతి: తెలుగుదేశం అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కరోనాతో అస్వస్థతకు గురికావడం విచారకరం. ఆయన త్వరగా కోలుకుని ప్రజల కోసం ఎప్పటిలాగే పని చేయాలని కోరుకుంటున్నానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "దేశంలోనూ, తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న కోవిడ్ రోగుల గణాంకాలు ఆందోళనకరంగానే ఉన్నాయి. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించే సిబ్బంది, ఉద్యోగులే అధిక సంఖ్యలో కోవిడ్ బారినపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయవేత్తలు కూడా కోవిడ్ బారినపడుతుండడం దీని తీవ్రతను తెలియచేస్తోంది. ప్రస్తుత పరిస్థితులలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు మరింత అప్రమత్తతతో కోవిడ్ నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. కోవిడ్ పరీక్షలు పెంచడం ద్వారా వైరస్ సోకినవారిని గుర్తించి వైద్యం చేసే అవకాశం కలుగుతుంది. ఇందుకోసం పరీక్ష కేంద్రాలు పెంచాలి. మొబైల్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రయోజనం. అలాగే కరోనా మొదటి వేవ్ సమయంలో పాటించిన ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలి" అని పవన్ కల్యాణ్ చెప్పారు.. "ఆంధ్రప్రదేశ్‌లో రాత్రి వేళ కర్ఫ్యూ, సమావేశాలు, వేడుకలపై పాక్షిక నిషేధాలు ఉన్నప్పటికీ పాఠశాలల్లో తరగతుల కొనసాగింపు ప్రస్తుత తరుణంలో తగదు. కోవిడ్ ఉధృతి తగ్గే వరకు తరగతులను వాయిదా వేయాలి. వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడం వంటి అంశాలు దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని వైసీపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి. ఈ క్లిష్ట తరుణంలో మద్యం దుకాణాలను మరో గంటపాటు అదనంగా తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత వైఖరిని వెల్లడిస్తోంది.

# సంపాదకీయం

బుధవారం 19 జనవరి 2022

## టెక్నాలజీ తో మార్ఫింగ్

దేశంలో విద్వేష వాతావరణం క్రమేపీ విస్తరిస్తున్నదని కలవరపడుతున్నవారికి తాజా పరిణామం మరింత ఆందోళన కలిగిస్తుంది. వందమంది ముస్లిం మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేయడంతోపాటు వారిని వేలం వేస్తూ దుండగులు ఆన్లైన్లో పెట్టిన వైనం అందరినీగ్ర్భాంతి పరిచింది. సరిగ్గా ఆరునెలల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఈ మాదిరే వందమంది మహిళలను లక్ష్యంగా చేసుకున్నారు. దానిపై ఇంతవరకూ సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమైనందువల్లే కావొచ్చు, దుండగులు మరోసారి రెచ్చిపోయారు. విద్వేషం తలకెక్కినవారికి యుక్తాయుక్త విచక్షణ ఉండదు. ఏం చేస్తున్నామన్న స్పృహ ఉండదు. అరెస్టయిన ఇద్దరిలో ఒకరు ఉత్తరాఖండ్కు చెందిన పద్దెనిమిదేళ్ల యువతి కాగా, మరొకరు బెంగళూరు యువకుడులక్షణంగా చదువుకోవాల్సిన వయసులో... పైపైకి ఎదగడానికి కావలసిన జ్ఞానాన్ని సముపార్జించి భవిష్యత్తుకు బంగారు బాటలు పరుచుకోవాల్సిన వయసులో పిల్లలు ఇంత విషపూరితంగా మారడానికి, దారి తప్పడానికి వారిని ప్రేరేపించిందీ, ఉన్మాదాన్ని నూరిపోసిందీ ఎవరు? సరిగ్గా దర్యాప్తు చేస్తే ఇవన్నీ బయటపడకపోవు. కొందరు భావిస్తున్నట్టు కేవలం ఆకతాయితనంతో చేసిన చిల్లర చేష్టగా దీన్ని కొట్టిపారేయడం అసాధ్యం. ఓపెన్ సోర్స్ వెబ్ టూల్ గిట్హబ్లో ఉంచిన ఈ యాప్ రూపకల్పన కేవలం వీరిద్దరు మాత్రమే చేసివుంటారని భావించడం కష్టం. సంఘటిత నేరగాళ్ల ప్రమేయం లేకుండా ఇది జరిగిందని విశ్వసించడం అసాధ్యం. దుండగుల లక్ష్యంగా మారిన మహిళల్లో అత్యధికులు ఉన్నత విద్యావంతులు, వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్ఠులు. ఇందులో పాత్రికేయులున్నారు, కళాకారులున్నారు, పరిశోధకులున్నారు, సినీతారలు న్నారు. వీరంతా తమ తమ రంగాలకే పరిమితం కాకుండా జరుగుతున్న అన్యాయాలపై బాధ్యతగా గళమెత్తుతున్నవారు. సామాజిక మాధ్యమాలతో సహా అన్ని వేదికల్లోనూ నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నవారు. సామాజిక అసమానతలకూ, అన్యాయాలకూ వ్యతిరేకంగా పోరాడుతున్నవారు. అయిదేళ్ల క్రితం జేఎన్యూలో అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన నజీబ్ అనే విద్యార్థి నాయకుడి తల్లి ఫాతిమా నఫీస్ ఫొటోను సైతం దుండగులు యాప్లో ఉంచారు. తమ ఉన్మాద చేష్టకు వారినే ఏరికోరి లక్ష్యంగా చేసుకోవడంలో? ఆ పిల్లలు కావొచ్చు, వారి వెనకున్న నేరగాళ్లు కావొచ్చు? ఆశించిన ప్రయోజనం ఏమిటి? ఆ మహిళలను అంగడి సరుకుగా చిత్రీకరించడం, వారి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం, భయకంపితులను చేయడం, ఆ మహిళలు తలెత్తుకోలేకుండా చేయడం తక్షణ ప్రయోజనం కావొచ్చు. కానీ అంతకన్నా ముఖ్యంగా కళ్లముందు జరిగే అన్యాయాలపై మరే మహిళా గొంతెత్తకుండా చూడటం, సమాజంలో పరస్పర వైషమ్యాలు పెంచడం, అది నిస్సహాయంగా మిగిలిపోయేలా చేయడం ఈ చేష్టల ఆంతర్యం. సారాంశంలో ఇది సామాజిక ధ్వంస రచన. అందుకే దీన్ని తేలిగ్గా తీసుకోలేం. ఆన్లైన్ విధానం అందుబాటులోకొచ్చాక... సామాజిక మాధ్యమాలు విస్తరించాక పౌరులకు గోప్యత లేకుండా పోయిందన్నది వాస్తవం. పౌరుల్లో ఎవరెవరు ఏ ఏ వెబ్సైట్లు చూస్తున్నారో, ఎలాంటి లావాదేవీలు నిర్వహిస్తున్నారో నిత్యం కన్నేసి ఉంచే విభాగాలు ప్రపంచ దేశాల న్నిటితోపాటు మన దేశంలో కూడా పెరిగాయి. దేశాల భద్రతకు ఇది అవసరం కూడా. గుర్తుతెలియని వ్యక్తులు చొరబడే ప్రయత్నం చేశారని తమ ఖాతాదారులను వివిధ మాధ్యమాలు హెచ్చరిస్తున్న ఉదంతాలు అడపా దడపా చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వెబ్సైట్లో ఒక అవాంఛనీయమైన యాప్ ప్రత్యక్షమైందని ఫిర్యాదు వచ్చేవరకూ గ్రహించ లేకపోవడం, వెనువెంటనే దర్యాప్తు జరిపి దాన్ని ఫలానా ప్రాంతంనుంచి ప్రయోగించి ఉంటారని ఆచూకీ రాబట్టలేకపోవడం చేతగానితనం కాదా? మహిళలపై జరిగే నేరాలను అరికట్టడానికి మన దేశంలో కఠినమైన చట్టాలు వస్తున్నాయి. కానీ ఆ నేరాలు తగ్గటం మాట అటుంచి క్రమేపీ పెరుగుతూ పోవడంలో పోలీసుల వైఫల్యమే ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఫిర్యాదు నమోదు చేసుకోవడం దగ్గరనుంచి మొదలయ్యే అలసత్వం నేరగాళ్లకు ఊతం ఇస్తోంది. ఈ వికృత యాప్ విషయంలోనూ జరిగింది ఇదే. తమ వెబ్సైట్లో ఉంచిన యాప్ను ఆరునెలలక్రితం ఇదే సంస్థ తొలగించింది. అది మినహా తమకేం కాలేదన్న ధైర్యంతో ఇప్పుడు మరో యాప్తో ఆ నేరగాళ్లు బయల్దేరారు. అట్టడుగు వర్గాలవారినీ, మహిళలనూ కించపరచడం, వారిపై విద్వేషం వెళ్లగక్కడం మన దేశంలో కొత్తేమీ కాదు. 'మతములన్నియు మాసిపోవును?జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును' అన్నాడు మహాకవి గురజాడ. కానీ ఆయన ఆశించినదానికి విరుద్ధంగా ఆధునికత పెరిగేకొద్దీ, అభివృద్ధి విస్తరిస్తున్నకొద్దీ విద్వేషం రూపం మార్చుకుంటోంది. ఊహించ సాధ్యంకాని పోకడలు పోతోంది. చూస్తుండగానే అది పిల్లలను కూడా కాటేస్తోంది. తెలిసీ తెలియని వయసులో వారిని నేరగాళ్లుగానో, బాధితులుగానో మార్చి వారి జీవితాలను అగాథంలోకి నెట్టేస్తోంది. దీన్ని సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోవడంలో విఫలమైతే సమాజం కల్లోలభరితమవుతుంది. విద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారి విషయంలో కేంద్ర ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తున్నదన్న ఆరోపణలు ఇప్పటికే వస్తున్నాయి. కనుక ఈ యాప్ రూపకర్తలపై కఠిన చర్యలకు ఉప్రకమించడం పాలకుల బాధ్యత.

## సామాన్య భక్తులు శ్రీవారి దర్శనానికి దూరం..



తిరుమల, జనవరి 18, అఖిలాండకోటికి బ్రహ్మాండ నాయకుడైన ఏడుకొండలస్వామి దర్శనం కోసం ఎన్ని ప్రయాసలు ఎదురైనా ఆనందంగా భరిస్తారు భక్తులు. వారికి కావల్సిందల్లా.. శ్రీవారి దర్శనమే. అందుకే సామాన్య భక్తులకు ఎలాంటి ప్రణాళికలు.. సిఫారసులు ఉండవు. తమను గట్టెక్కించే స్వామివారు గుర్తుకొస్తే చాలు తిరుమల వచ్చేస్తారు. స్వామివారిని దర్శించుకుని.. ఆ సమయంలో కలిగే దివ్యానిభూతితో తిరుగు ప్రయాణం అవుతారు భక్తులు. కానీ.. ఏడాదిన్నర కాలంగా సామాన్య భక్తులకు శ్రీవారు దూరం. ఈ మాట అనేకంటే టీటీడీ నే అంచెలంచెలుగా దూరం చేస్తోందా అనే సందేహాలు కలుగుతున్నాయి. శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల్లో 60–70 శాతం సామాన్యులే. కోవిడ్ ఆంక్షల పేరుతో కనీసం ఆరు శాతం సామాన్యులు కూడా శ్రీవారిని దర్శించుకోవడం లేదుకోవిడ్ మొదలైనప్పటి నుంచి శ్రీవారి ఆలయంలో దర్శనాల నియంత్రణ కొనసాగుతోంది. ఈ ఆంక్షలు కూడా ఒకవైపే అన్నట్టుగా మారిపోయింది. ప్రస్తుతం 30–40 వేలమంది భక్తులను దర్శనానికి అనుమతిస్తూన్నా.. అవన్నీ ఆన్లైన్లో కేటాయిస్తున్నవే. సర్వదర్శనం టోకెన్లు ఇస్తున్నా.. సామాన్యులకు ఆమడ దూరంలోనే ఉన్నాయి. ఆన్లైన్లో సంపన్నులుతో పోటి పడి దర్శనం టికెట్లు పొందే సామర్థ్యం సామాన్యులకు లేదనే వాదన ఉంది. ఆఫ్లైన్లో సామాన్య భక్తులకు అందుబాటులో ఉండేలా సర్వదర్శనం టోకెన్లు జారీ చేయాలి అంటే మాత్రం కోవిడ్ అడ్డొస్తోంది. కరోనా ఆంక్షలు పాటించాల్సి ఉన్నా.. వాటిని సామాన్య భక్తులకే వర్తింప చేయడంపై ప్రశ్నలు వినిపిస్తున్నాయి. తిరుమలలో రోజూ సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాలను? ఆఫ్లైన్లో జారీ చేస్తున్నారు. వాటిపై నియంత్రణ లేదు. ఆ టికెట్ల సంఖ్య తగ్గించలేదు. పైపెచ్చు వాటి సంఖ్య పెరిగిందనే చెప్పాలి. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను పూర్తిగా ఆన్లైన్లో కేటాయిస్తున్నా.. గతంతో పోల్చితే వీటి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. గతంలో రోజుకి 18–20 వేల టికెట్లు జారీ చేయగా..ప్రస్తుతం 20–25 వేల వరకూ ఉంటోంది. వర్చువల్ సేవా టికెట్లు, సుపథం టికెట్లు.. ఇలా ఎక్కడా ఆ వర్గాలకు కోత లేదు. సమస్యంతా సామాన్య భక్తులదే అన్నట్టుగా వారి సంఖ్యని టీటీడీ పూర్తిగా కట్టడి చేసింది. గతంలో రోజుకి 30–50 వేలమంది సామన్య భక్తులు శ్రీవారిని దర్శించుకునేవారు. ప్రస్తుతం సామాన్యులకు ఇస్తున్న టోకెన్లు పదివేలే. అదీ ఆన్లైన్లోనే అందిస్తోంది. భక్తులకు తిరుపతిలో దర్శనం టోకెన్లు జారీ చేస్తే.. వాటిని పొందే క్రమంలో కోవిడ్ వ్యాప్తి చెందుతుందని టీటీడీ హడలిపోతోంది. అయితే వీఐపీ టికెట్ల కోసం ఎంబీసీల వద్ద నిత్యం భక్తులు గుమిగూడినప్పుడు కానీ.. వాళ్లంతా దర్శనానికి వెళ్లే సమయంలో కానీ కరోనా ప్రబలదట. ఎందుకో టీటీడీనే చెప్పాలి. వైకుంఠ ఏకాదశి రోజున వీవీఐపీల పేరుతో జరిగిన హడావిడి కానీ.. వాళ్లంతా దర్శనానికి వెళ్లిన సమయంలో కానీ.. ఎక్కడా కోవిడ్ నిబంధనలు పాటించలేదు. ఆంక్షలు అమలవుతున్నాయో లేదో పట్టించుకోలేదు. అదే సామాన్య భక్తుల దగ్గరకు వచ్చేసరికి నిబంధనల కొరడా ఝుళిపిస్తున్నారు. కొండపై సామాన్యులకే ప్రాధాన్యమనే మాటను మాటలకే పరిమితం చేసి.. పెద్దలను ఒకలా.. సాధారణ భక్తులను మరోలా చూడటమే విమర్శలకు తావిస్తోంది.

## విద్య బలోపేతం దిశగా అడుగులు




విజయవాడ, జనవరి 18 పాఠశాల విద్యను మరింత పరిపుష్టం చేసే దిశగా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అడుగులు వేస్తోంది. జాతీయస్థాయిలో రూపకల్పన చేస్తున్న నేషనల్ కరిక్యులం ఫ్రేమ్వర్క్ (ఎన్సీఎఫ్)కు స్థానిక అంశాలు, పరిస్థితులను జోడించనుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్వర్క్ను రూపొందించనుంది. పిల్లల్లో పునాది స్థాయి నుంచి విద్యాభ్యసన సామర్థ్యాలు పెంచడం ద్వారా పాఠశాల విద్య, ఆపై ఉన్నత విద్య పరిపుష్టం అవుతుందన్న ఉద్దేశంతో తాజాగా కార్యాచరణ ప్రారంభించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను స్పృశిస్తూ స్థానికుల అభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టింది. ప్రతి జిల్లాలో మేధావులు, విద్యావేత్తలు, ఇతర ప్రముఖులతో పాటు వివిధ వర్గాలకు చెందిన నాలుగు వేల మంది నుంచి విద్యారంగ పురోగతిపై ఈ అభిప్రాయాలను సేకరించనుంది. ఇందుకోసం ఎన్సీఈఆర్టీ ఆయా రాష్ట్రాల విద్యా పరిశోధన, శిక్షణ మండళ్ల ద్వారా ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయిస్తోంది. అభిప్రాయ సేకరణ, నివేదికల రూపకల్పన వంటివన్నీ పూర్తిగా ఆన్లైన్లోనే నిర్వహించేలా ఏర్పాట్లుచేసింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ను కూడా అందుబాటులోకి తెచ్చింది. పూర్వ ప్రాథమిక విద్య, పాఠశాల విద్య, ఉపాధ్యాయ విద్య, వయోజన విద్య అనే నాలుగు విభాగాల పరిపుష్టం దిశగా నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్వర్క్ రూపొందనుంది. ఇందుకు సంబంధించిన ముఖ్యాంశాలను ఎస్సీఈఆర్టీ గుర్తించి అన్ని రాష్టాలకు వీటిని నిర్దేశించింది. నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి ఈ అంశాల్లో అభిప్రాయాలను స్వీకరించనుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎస్సీఈఆర్టీలు, ఎన్సీఈఆర్టీ జిల్లా స్థాయిలో సంప్రదింపులు చేపట్టనున్నాయి. వీటి ఆధారంగా 25 ఫోకస్ గ్రూపుల ద్వారా పొజిషన్ పేపర్లను రూపొందించనుంది. 'మైగవ్.ఐఎన్' పోర్టల్తో పాటు సర్వే కోసం మొబైల్ యాప్ను ఏర్పాటుచేసింది. ఇక కొత్త జాతీయ కరిక్యులమ్ ఫ్రేమ్వర్క్ రూపకల్పన కోసం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇప్పటికే 12 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటుచేసింది. సిలబస్, పాఠ్యపుస్తకాల రూపకల్పన, బోధనా పద్ధతులను రూపొందించి అన్ని రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేయనుంది. ప్రస్తుతం 2005లో రూపొందించిన నాలుగవ జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్వర్క్ ఇప్పటికీ అమల్లో ఉంది. అయితే, ఈ మధ్యకాలంలో విశ్వవ్యాప్తంగా విద్యారంగం.. దానికి ఆలంబనమైన రంగాల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి? ఫ్రేమ్వర్క్కు కేంద్రం ఏర్పాట్లుచేసింది. రానున్న కాలంలో పూర్తిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అభివృద్ధికి అవకాశమున్నందున ఆ దిశగా పిల్లలను తీర్చిదిద్దేలా ఈ ఫ్రేమ్వర్క్ను రూపొందించాలని నిర్ణయించింది. ముఖ్యంగా పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిల్లోనే పిల్లల్లో పఠనం, లేఖనం, గణితం అంశాల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలన్నదే లక్ష్యం. నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్వర్క్ను స్థానిక అంశాలకు, పరిస్థితులకు అనుగుణంగా రూపొందించడం ద్వారానే ఈ లక్ష్యాలను సాధించేలా చర్యలు చేపట్టింది. దీని ప్రకారమే రాష్ట్రాల కార్యక్రమాలకు కేంద్రం నిధులు అందించే అవకాశాలున్నాయని రాష్ట్ర ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి. ప్రతాప్రెడ్డి అభిప్రాయపడ్డారు.

ఎస్సీఈఆర్టీ గుర్తించిన ముఖ్యాంశాలివే..

5+3+3+4 విధానంలో పాఠ్య ప్రణాళిక, బోధనా విధానం
ఎర్లీ చైల్డ్హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్
ఫౌండేషనల్ లిట్రసీ, అండ్ న్యూమరసీ
కాంపిటెన్సీ బేస్డ్ ఎడ్యుకేషన్
సెకండరీ తరగతుల్లో సబ్జెక్టు ఎంపిక చేసుకునే సౌలభ్యం
కరికులమ్ కుదింపు, కోర్ ఎసెన్షియల్స్
3, 5, 8 తరగతుల్లో బెంచ్మార్కు లెర్నింగ్ లెవెల్స్
వొకేషనల్ విద్య పునర్వ్యవస్థీకరణ
బహుభాషా పరిజ్ఞానం
21వ శతాబ్దపు నైపుణ్యాలు.. ఐసీటీ తదితరాలు
జీవ నైపుణ్యాలు, పౌరసత్వం, నైతికత, జాతీయ వారసత్వ సంపద, ప్రజా ఆస్తుల పరిరక్షణ, సేవా దృక్పథం
సమ్మిళిత విద్య? ఆర్ట్స్, క్రాఫ్ట్, టాయిస్, స్పోర్ట్స్? ఫిజికల్ ఎడ్యుకేషన్
ఇండియన్ నాలెడ్జి సిస్టమ్
పాఠశాల విద్య, ఉన్నత విద్య మధ్య అనుసంధానం
స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్
ఎగ్జామ్స్ రిఫార?మ్స్, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు
స్కూల్ కమ్యూనిటీ రిలేషన్
వనరుల వ్యవస్థల బలోపేతం
పాఠ్యపుస్తకాల డిజైన్, డెవలప్మెంట్

## కమలంలో కనిపించని చడీ చప్పుడు




విజయవాడ, జనవరి18, ఆంధ్రప్రదేశ్ లో భారతీయ జనతా పార్టీ ఆచూకీ కన్పించకుండా పోయింది. ఆ పార్టీ నేతల ప్రకటనలు ఆర్భాటమే తప్పించి ఆచరణలో మాత్రం పెట్టడం లేదు. నెలన్నర రోజుల క్రితం అమిత్ షా తిరుపతి వచ్చారు. ఏపీ బీజేపీ నేతలకు క్లాస్ పీకారు. రాజధాని అమరావతి రైతుల పాదయాత్రలో పాల్గొనాలని చెప్పారు. ఒకరోజు పాల్గొన్నారు. ముగింపు సభలో కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని షా మాటలకు విలువనిచ్చారు. ఆ తర్వాత దాని ఊసే వదిలి పెట్టారు. అది వేరే సంగతి. చేరికలపై.... ఈ సమావేశంలోనే అమిత్ షా పార్టీలో చేరికలు ఉండాలని ఆదేశాలు జారీ చేసి వెళ్లారని వార్తలు వచ్చాయి. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సయితం త్వరలోనే పార్టీలో జాయినింగ్స్ ఉంటాయని ఆర్భాటంగా ప్రకటించారు. అన్ని పార్టీల నుంచి తమ పార్టీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఇక కండువాలు కప్పడమే తరువాయి అంటూ కలరింగ్ ఇచ్చారు. అది నిజమేననుకుని పార్టీ క్యాడర్ ఖుషీ అయింది. కానీ బీజేపీలో చేరేందుకు ఎవరూ మొగ్గు చూపడం లేదు. దీనికి కారణం ఆ పార్టీకి ఇక్కడ బేస్ లేకపోవడమే. జనసేన పార్టీ పొత్తు ఉన్నప్పటికీ దానిపై నమ్మకం లేకపోవడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తింది. విభజన తర్వాత ఏపీకి పెద్దగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉపయోగపడకపోవడం, ఉన్న సంస్థలను ప్రయివేటు పరం చేయడం, పెట్రోలు, నిత్యావసరాల ధరల పెరుగుదల వంటి అంశాలతో అన్ని వర్గాల ప్రజలు ఆపార్టీకి దూరమయినట్లే కన్పిస్తుంది. ఇక ఉన్న నేతలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. జిల్లాల వారీగా చేరికల కోసం బీజేపీ నేతలు జల్లెడ వేసి చూస్తున్నా ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదు. బీజేపీ కంటే జనసేనలో చేరితే ఫ్యూచర్ ఉంటుందన్న భావన నేతల్లో వ్యక్తమవుతుంది. ఇక వచ్చే ఎన్నికలలో ఏ పార్టీలో టిక్కెట్లు రాని వారు తప్ప ఏపీ బీజేపీ వైపు ఎవరూ కన్నెత్తి చూడరన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పుడు ఉన్న నేతలు పార్టీని వీడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత బీజేపీ అగ్రనేతలపై ఉంది. లేకుంటే అలా వచ్చి సెటిల్ అవుదామనుకుంటున్న వారు సయితం వెళ్ళిపోతారు.

## ఆనం .. దారెటు...

నెల్లూరు, జనవరి 18,నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి. సంచలన కామెంట్స్తో అధికారపార్టీని కలవరపెడుతున్న ఆయనపై.. లోకల్ వైసీపీ లీడర్లు గుర్రుగా ఉన్నారు. ఎన్నికల్లో ఆనం గెలుపుకోసం పనిచేసిన నాయకులు.. కార్యకర్తలు ఒక్కొక్కరుగా ఎమ్మెల్యేకు దూరం జరుగుతున్నారు. వెంకటగిరి వైసీపీ వర్గాలుగా విడిపోయింది. ఇక్కడి పరిణామాలపై పార్టీ పెద్దలు కూడా ఫోకస్ పెట్టినట్టు చెబుతున్నారు. అసంతృప్తులను బుజ్జగించేందుకు నేరుగా రంగంలోకి దిగినట్టు సమాచారం. 2019 ఎన్నికలు ముందు వరకు ఆనం రామనారాయణరెడ్డి టీడీపీలో ఉన్నారు. ఆ సమయంలో వెంకటగిరి వైసీపీ ఇంచార్జ్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి. లోకల్ వైసీపీ లీడర్లుగా గుర్తింపు పొందిన ఢిల్లీ బాబు, రాంప్రసాద్రెడ్డి, సురేష్రెడ్డిలు బొమ్మిరెడ్డికి మద్దతుగా ఉండేవారు. ఆనం వైసీపీలో చేరడం.. పార్టీ టికెట్ చకచకా జరిగిపోయింది. ఈ నిర్ణయం రుచించని సురేష్రెడ్డి, ఢిల్లీబాబులు సైలెంట్ అయిపోయారు. ఇంతలో మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ దొంతు శారద, మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యచేంద్ర సైతం వైసీపీలో చేరడంతో పార్టీ బలం పెరిగింది. అయితే జగన్ సూచనల మేరకు అసంతృప్త నేతలతో ఆనం సమావేశమై సమస్యను కొలిక్కి తెచ్చారు. ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే ఆనం వైఖరి రుచించని పార్టీ నేతలు ఒక్కొక్కరుగా దూరం అవుతూ వచ్చారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో దొంతు శారద ఛైర్పర్సన్ పదవి ఆశించారు. కానీ.. భానుప్రియ అనే మరో మహిళను ఎమ్మెల్యే ఆనం ఎంపిక చేయడంతో.. శారద వర్గం దూరమైంది. పార్టీ పెద్దలు ఆమెతో చర్చలు జరిపి శాంతింపజేశారు. ఆమెకు నామినేటెడ్ పదవి రాకుండా ఆనం అడ్డుకున్నారనే ప్రచారం జరిగింది. సరిగ్గా అదే సమయంలో శారదను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్పర్సన్గా నియమించారు. పదవి వచ్చినా శారద వర్గం ఆనంతో గ్యాప్ మెయింటైన్ చేస్తూనే ఉంది. మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎంపికలోనూ విభేదాలు రావడంతో పార్టీ నేత రాంప్రసాద్రెడ్డి సైతం ఎమ్మెల్యే ఆనంకు దూరమయ్యారు. స్థానికంగా తమ సూచనలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ యాచేంద్ర గుర్రుగా ఉన్నారట. ఈ వరస పరిణామాలు వైసీపీ పెద్దల దృష్టికి వెళ్లినట్టు సమాచారం. కొందరు పార్టీ నాయకులు.. వైసీపీ జిల్లా వ్యవహారాల ఇంచార్జ్ సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారట. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆనంపై వారు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అయితేపార్టీ కోసం పనిచేసిన వారిని విస్మరించబోమని సజ్జల హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆనం వద్దన్నా దొంతు శారదకు పదవి ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారట. ప్రస్తుతానికి కొంత సర్దుకోవాలని చెప్పినా.. అసంతృప్త నేతలు మాత్రం ఆనంతో దూరంగా ఉండటానికే మొగ్గు చూపుతున్నారట.

## వైవీ ఆవేదన వెనుక ఎంత స్టోరీనో



ఒంగోలు, జనవరి 18,వైవీ సుబ్బారెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనున్నారా? అందుకు ఆయన ఇప్పటి నుంచే రంగం సిద్ధం చేసుకుంటున్నారా? అంటే అవుననే అంటున్నారు. ప్రస్తుతం టీటీడీ ఛైర్మన్ గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి 2024 లో జరిగే ఎన్నికల్లో పోటీకి సిద్ధమన్న సంకేతాలను పంపుతున్నారు. ఆయన ఒంగోలు పార్లమెంటు నుంచి పోటీ చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. జగన్ కూడా అందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు వైవీ వర్గీయులు చెబుతున్నారు. ప్రస్తుతం వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్ గా ఉన్నారు. ఆయనకు రెండోసారి టీటీడీ ఛైర్మన్ పదవిని జగన్ ఇచ్చారు. అంటే 2023 చివర వరకూ టీటీడీ ఛైర్మన్ గా సుబ్బారెడ్డి కొనసాగుతారు. మరో ఏడాదిలో ఎన్నికలు ఉండటంతో ఆయనకు ఈసారి మళ్లీ టీటీడీ పదవి తీసుకునే ఛాన్స్ లేదు. ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి పరిస్థితి ఏంటన్న చర్చ కూడా జరగుతుంది. అయితే ఒంగోలు పార్లమెంటు కు వైవీ సుబ్బారెడ్డి పోటీ చేస్తే, మాగుంట కుటుంబానికి శాసనసభలో అవకాశమివ్వాలని నిర్ణయించారని తెలిసింది. మాగుంట శ్రీనివాసరెడ్డి తన కుమారుడు రాఘవరెడ్డిని రాజకీయాల్లోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికలే సరైన సమయం అని ఆయన భావిస్తున్నారు. అయితే రాఘవరెడ్డిని గిద్దలూరు లేదా కనిగిరి నుంచి పోటీ చేయించాలన్నది మాగుంట శ్రీనివాసరెడ్డి ఆలోచన. గిద్దలూరు లేదా కనిగిరి.... ఈ రెండు నియోజకవర్గాల్లో మాగుంట కుటుంబానికి మంచి పట్టుంది. వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా వైసీపీకి కూడా ఈరెండు నియోజకవర్గాల్లో బలమైన ఓటు బ్యాంకు ఉంది. అందుకే ఈ రెండు నియోజకవర్గాలలో ఏదో ఒక దాని నుంచి పోటీ చేయాలని మాగుంట రాఘవరెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వైవీ సుబ్బారెడ్డి 2024 ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటుకు పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారు. మరి కనిగిరి, గిద్దలూరు లో ప్రస్తుతమున్న ఎమ్మెల్యేలపరిస్థితి ఏంటన్నది జగన్ తేల్చాల్సి ఉంటుంది.

## కన్ఫ్యూషన్ లో రాష్ట్ర పాలన

విజయనగరం కోట జంక్షన్ లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు అశోకగజపతి రాజు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసి 40 ఏళ్ళు పూర్తయింది. టీడీపీ పాలన ప్రజా సంక్షేమ లక్ష్యంగా కొనసాగింది. ఇప్పుడు ఆ పరిస్థితులు కనిపించడం లేదు. రాష్ట్రంలో పాలన అంతా కన్ఫ్యూషన్ లో ఉన్నది. ప్రార్థన స్థలాలకు వెళితే కరోన పెరుగుతాదట...మరి పాఠశాలల్లో పెరగదా...? ప్రజాస్వామ్యాన్నీ రాజ్యాంగ బద్దంగా నడపడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. కరోన జాగ్రత్తలు తీసుకొని ప్రజా సమస్యలపై పోరాడాలి. జిల్లా అడ్మినిస్ట్రేషన్ ను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ పాలన ఉంది. అందుకే కోవిడ్ నియంత్రణపై సరైన కట్టడి లేదని అన్నారు.

## రఘురామ ధైర్యానికి రీజనేంటీ

ఏలూరు, జనవరి 18, ఆంధ్రప్రదేశ్ లో మరో ఉప ఎన్నిక జరగబోతుంది. ఈ ఏడాది చివరలోనే ఉప ఎన్నికల జరిగే అవకాశముంది. వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణరాజు వచ్చే నెల 5వ తేదీ తర్వాత రాజీనామా చేయనున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు రెండు దశల్లో మార్చి 14వ తేదీ వరకూ జరగనున్నాయి. ఆ సమావేశాల తర్వాతనే బహుశ రఘురామ కృష్ణరాజు రాజీనామా ఉండవచ్చు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోపు ఎన్నికలు జరగాల్సి ఉంది. అంటే ఈ ఏడాది సెప్టంబరులోపుగా నరసాపురం పార్లమెంటుకు ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. రఘురామ కృష్ణరాజు ఏ పార్టీ నుంచి పోటీ చేయాలో డిసైడ్ అయ్యారు. రాజీనామా చేసిన వెంటనే ఆయన ఆ పార్టీలో చేరతారు. అందుకు రంగం కూడా సిద్ధం చేసుకుంటున్నారు. ఆయన ఏ పార్టీ నుంచి పోటీ చేసినా వైసీపీయేతర పార్టీల సహకారం తీసుకోనున్నారు. వైసీపీ వర్సెస్ రఘురామ కృష్ణరాజులాగానే ఎన్నిక జరిగేలా ఆయన చూసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దగా ప్రయత్నం చేయకపోయినా? రఘురామ కృష్ణరాజు పెద్దగా ప్రయత్నం చేయనక్కరలేదు. జగన్ కొమ్ములు వంచాలంటే ఈ ఎన్నికలో ఓడించాలి. అందుకే ఆయన అడగకపోయినా అన్ని పార్టీలూ మద్దతిచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే వైసీపీకి ఈ ఎన్నికలో నెగ్గుకు రావడం కష్టమే. ఇప్పటి వరకూ జరిగిన తిరుపతి, బద్వేలు ఉప ఎన్నికల్లో వైసీపీ సునాయాసంగా గెలిచింది. అయితే ఆ ఎన్నికల నేపథ్యం వేరు. ఈ ఎన్నిక వేరు. ఆ ఎన్నికల్లో సిట్టింగ్ లుగా ఉన్న వారు మరణించారు. అక్కడ ప్రత్యర్థులకు కూడా పెద్దగా బలం లేదు. కానీ ఇక్కడ గత ఎన్నికల్లోనే వైసీపీకి పెద్దగా మెజారిటీ రాలేదు. ఆ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రఘురామ కృష్ణరాజుకు కేవలం 35 వేల ఓట్ల మెజారిటీతో బయటపడ్డారు. కానీ నరసాపురం అలా కాదు. అన్ని పార్టీలూ బలంగా ఉన్నాయి. ఇక్కడ సామాజికవర్గాల పరంగా చూసినా ప్రత్యర్థుల బలాన్ని తక్కువ అంచనా వేయలేం. క్షత్రియులు, కాపు సామాజికవర్గం బలంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఇద్దరూ కలిస్తే వైసీపీకి విజయం కష్టమే. అందుకే లెక్కలు వేసుకుని మరీ రాజుగారు బరిగీశారు. జగన్ కు కూడా ఈ ఉప ఎన్నిక ప్రతిష్టాత్మకం. తనను కాదని కాలుదువ్వి వెళ్లిన రాజు గెలిస్తే తన పరువు గోదారిలో కలవడం ఖాయం. ఈ ఎఫెక్ట్ 2024 ఎన్నికల్లో ఖచ్చితంగా కనపడుతుంది. మొత్తం మీద రఘురామ కృష్ణరాజు జగన్ కు పెద్ద పరీక్ష పెట్టారనే చెప్పాలి. ఈ ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే ఇక జగన్ కు వచ్చే ఎన్నికల్లోనూ తిరుగులేనట్లే.

## చంద్రబాబు కోలుకోవాలని పూజలు

పూతలపట్టు చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం తవణంపల్లి మండల కేంద్రంలో నారా చంద్రబాబునాయుడు, గారు మరియు లోకేష్ బాబు గారు కారోన నుండి త్వరగా కోలుకోవాలని శ్రీ కాలభైరవ ఈశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న, తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దిలీప్, మాజీ జెడ్పిటిసి వెంకటేశ్వర చౌదరి, తెలుగుదేశం పార్టీ బిసి సెల్ అధ్యక్షులు వినాయక, తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ శరవణ, తెలుగురైతు జిల్లా కార్యదర్శి జైపాల్, తెలుగు మహిళ అధ్యక్షురాలు చిట్టెమ్మ, టిడిపి నాయకులు సునీల్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

### శ్రీకాకుళం జిల్లాలో వైసిపి నేతలు అశ్లీల నృత్యాలు చిందులు

శ్రీకాకుళం యాంకర్ : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కోటపాలెం,పెద్ద శేరి గ్రామంలో వైసిపి నేతలు రికార్డింగ్ డాన్సులు ఏర్పాటు చేశారు. అమ్మాయిలు చేసిన అశ్లీల నృత్యాలకు కొందరు వైసిపి నేతలు చిందులు వేశారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఈ జాతర ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే ఈ నృత్యాలు చూసి ఆనందించారు. ఓ పక్క పోలీసులు సైతం ఈ డాన్సులు ను ఆపే ప్రయత్నం చేయలేదని స్థానికులు అంటున్నారు. జిల్లాలో రోజుకి వందల సంఖ్యలో కోవిడ్ కేసులు నమోదు అవుతున్న తరుణంలో ఇలాంటి అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసం అని స్థానికులు నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఇష్టం ఉంటేనే టీకా వేసుకోండి.. స్పష్ట చేసిన కేంద్రప్రభుత్వం

న్యూ ఢిల్లీ జనవరి 18 కరోనా టీకా తీసుకోవాలని ఎవరినీ బలవంతం పెట్టడం లేదని కేంద్రప్రభుత్వం స్పష్ట చేసింది. నచ్చితేనే టీకా తీసుకోవాలని సూచించింది. వ్యాక్సినేషన్ తప్పనిసరి అనే నిబంధన ఎక్కడా పెట్టలేదని కేంద్రం తెలియజేసింది. కరోనా పంపిణీపై ఆరోగ్య శాఖ విడుదల చేసిన మార్గదర్శకాల్లోనూ ఒత్తిడి తెచ్చే విధంగా లేవని క్లారిటీ ఇచ్చింది. టీకా వేసుకోవాలని కేంద్రం బలవంతం చేస్తుందనే విమర్శల నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం సమక్షంలో కేంద్రం స్పష్టతనిచ్చింది.కొవిడ్ ను ఎదుర్కోవడానికి వ్యాక్సిన్ ఒక్కటే ఆయుధమని వైద్య నిపుణులు చెప్పారు. ఇకపోతే టీకా తీసుకున్నవారిలోనూ ముప్పు తక్కువే ఉంది. ఈ నేపథ్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఇక వందశాతం టీకా పంపిణీ దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే టీకా విషయంలో ఒత్తిడి తెస్తున్నారంటూ కొందరు కోర్టునాశ్రయించారు. టీకాపై బలవంతం వద్దంటూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా దీనిపై ప్రభుత్వాన్ని కోర్టు వివరణ కోరింది. టీకా పంపిణీ వివరాలతో కూడిన అఫిడవిట్ ను కేంద్రం సమర్పించింది.ప్రజల ఆరోగ్యం దృష్ట్యా వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టినట్లు కేంద్రం తెలిపింది. మహమ్మారి నుంచి దేశ ప్రజలను కాపాడడానికే టీకా పంపిణీని వేగంవంతం చేశామని పేర్కొంది. అంతేకాకుండా వివిధ మాధ్యమాల ద్వారా వ్యాక్సిన్ పట్ల ప్రజలను చైతన్యం చేస్తున్నామని వెల్లడించింది. వ్యాక్సినేషన్ ఏర్పాట్లపై అవగాహన కల్పించామని వివరించింది. టీకా తీసుకుంటే కలిగి లాభాలు కావాల్సిన అర్హతల గురించి చెబుతున్నామని క్లారిటీ ఇచ్చింది. అయితే ఎక్కడా కూడా బలవంతంగా టీకా ఇవ్వడం లేదని స్పష్టం చేసింది.దివ్యాంగులకు టీకా తప్పనిసరి అనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎవరా అనే స్వచ్ఛంద సంస్థ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వారికి టీకాలు ఇచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించాలని కోరింది. కాగా దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం... కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. కాగా టీకా ధ్రువపత్రం తప్పనిసరి అనే నిబంధనను ఎక్కడా విధించలేదని స్పష్టం చేసింది. ఎవరికీ బలవంతంగా టీకా వేయలేదని క్లారిటీ ఇచ్చింది.వ్యాక్సిన్ పై బలవంతమేమి లేదని... ఇష్టం ఉంటేనే తీసుకోవాలని మరోసారి ప్రకటించింది. ఇదిలా ఉండగా దేశంలో కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్నాయి. రోజువారీ కేసులు రెండు లక్షలకు పైగా నమోదవుతున్నాయి. వాటిలో ఎక్కువగా న్యూ వేరియంట్ ఒమిక్రాన్ కేసులే ఉంటున్నాయి. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లోనూ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

# బసవతారకం ఆసుపత్రిలో ఎన్టీఆర్ వర్ధంతి

హైదరాబాద్ తెలుగుదేశం పార్టీ స్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ మరియ రీసెర్చి ఇన్సిస్టిట్యూట్ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 26 వ వర్ధంతి వేడుకలను హాస్పిటల్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంస్థ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ, సంస్థ ఆవరణలో ఉన్న బసవతారకం రామారావు విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వైద్యులు, సిబ్బందిని ఉద్దేశించి బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్ తన భార్య క్యాన్సర్ తో బాధపడి చనిపోయిన తర్వాత అలాంటి ఇబ్బందులు మరొకరికి ముఖ్యంగా పేదలకు ఎదురుకాకుండా చూడాలన్న సంకల్పంతో ఈ ఆసుపత్రిని స్థాపించారని తెలిపారు. నాటి నుండి నేటి వరకూ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందుతూ ప్రపంచ స్థాయి క్యాన్సర్ చికిత్సను ఎందరో పేదలకు ఆరోగ్యశ్రీ పథకం తో పాటూ ఉచితంగానూ వైద్యం అందించడంలో ముందంజలో ఉందని చెప్పారు. ముఖ్యంగా కరోనా కాలంలో కూడా క్యాన్సర్ రోగులకు ఇబ్బందులు ఎదురుకాకుండా వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఎంతో ధైర్యంగా చికిత్స అందించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ తండ్రి ఆశయాలకు తగినట్లుగా సంస్థను ముందుకు నడిపిస్తామని హామీ ఇచ్చారు.కోవిడ్ పరీక్షలకు బారులుహైదరాబాద్ ఒమిక్రాన్ వైరస్ వ్యాప్తి దృష్ట్యా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జలుబు దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వేంటనే సమిపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కరోనా పరీక్షలు చేయించుకోవడానికి ప్రజలు బారులు తిరుతున్నారు. హైదరాబాద్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో హఫిజ్ పేట్, లింగంపల్లి, రాయదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొండాపుర్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కరోనా నిర్థారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అన్ని కేంద్రాల్లో 465 ర్యాపిడ్ టేస్టులు నిర్వహించగా 118 పాజిటివ్ కేసులునమోదుకాగా, 114 ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించగా వాటి ఫలితాలు రావలసి ఉంది

# వైఎస్ వివేకా హత్య కేసులో కీలక పరిణామం

### దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్ పిటీషన్ ను కొట్టివేసిన కోర్టు

అమరావతి జనవరి 18 వైఎస్ వివేకా హత్య కేసు విచారణ హైకోర్టులో జరుగుతోంది. నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్ పిటీషన్ ను కోర్టు కొట్టివేసింది. బెయిల్ ఇవ్వాలంటూ శివశంకర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. బెయిల్ ఇచ్చేందుకు వీలు లేదని సీబీఐ వాదించింది.దేవీరెడ్డి శివశంకర్ రెడ్డి కీలక నిందితుడు కావడంతో సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముందని సీబీఐ తెలిపింది. కడప కోర్టు కూడా బెయిల్ తిరస్కరించిందని సీబీఐ లాయర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.కేసు దర్యాప్తు కీలక దశల్లో ఉన్నందున బెయిల్ ఇవ్వడం సాధ్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. సీబీఐ వాదనతో ఏకీభవిస్తూ శివశంకర్ రెడ్డి బెయిల్ పిటీషన్ ను కోర్టు కొట్టివేసింది.వివేకా హత్య కేసులో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి పేరును నిందితుడు దస్తగిరి చెప్పిన సంగతి తెలిసిందే. శివశంకర్ రెడ్డితోపాటు వైఎస్ కుటుంబ సభ్యుల పేర్లను కూడా దస్తగిరి ప్రస్తావించినా సంగతి తెలిసిందే.వివేకా కూతురు డాక్టర్ సునీత కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్ లో దేవిరెడ్డి పేరుంది. ఈ నేపథ్యంలోనే వివేకా హత్య కేసులో అరెస్ట్ అయ్యి కడప కేంద్ర కారాగారంలో ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసింది.ఈ హత్య చేస్తే శంకర్ రెడ్డి రూ.40 కోట్లు ఇస్తానన్నాడని.. రూ.5 కోట్లు నీకు ఇస్తానని వివేకాకు సన్నిహితుడైన ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని అప్రూవర్ గా మారిన షేక్ దస్తగిరి నేర అంగీకార వాంగ్మూలంలో వెల్లడించాడు.. ఇప్పటికే తన తండ్రి వివేకా హత్యపై డాక్టర్ సుజాత కొన్ని ఆధారాలను సమర్పించింది.అందులో శివశంకర్ రెడ్డి పాత్రపై విచారించాలని కోరింది. మరి నిందితుడు దస్తగిరి డాక్టర్ సునీతలు అనుమానించిన దేవి రెడ్డి నుంచి ఎలాంటి నిజాలు బయటకు వస్తాయన్నది వేచిచూడాలి.

# ఇలాంటి పీఆర్సీని నా సర్వీస్లో చూడలేదు

### బండి శ్రీనివాసరావు

విజయవాడ జనవరి18 ఇలాంటి పీఆర్సీని తన సర్వీస్లో ఇంతవరకు చూడలేదని ఏపీ జేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసరావు అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన పీఆర్సీపై స్పందించిన ఆయన మాట్లాడుతూ కుడిచేత్తో ఇచ్చి ఎడం చేత్తో వసూలు చేస్తోందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్లు రూ. 40 వేలు హెచ్ఆర్ఏ తీసుకొని తమకు తగ్గించాలని రిపోర్ట్ ఇస్తారా? అంటూ మండిపడ్డారు. తమకు ఈ పీఆర్సీ వద్దని, పాత పీఆర్సీ, డిఏలను కొనసాగించాలని బండి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగుల భయాందోళనలే నిజమయ్యాయి. జగన్ ప్రభుత్వ 'రివర్స్ పీఆర్సీ' ఖరారైపోయింది. ఇక... ఉద్యోగుల జీతాలు, రిటైర్డ్ సిబ్బంది పెన్షన్లు భారీగా తగ్గనున్నాయి. వేతన సవరణకు సంబంధించిన జీవోలు సోమవారం రాత్రి పొద్దుపోయాక విడుదలయ్యాయి. ఇప్పటికే ఐఆర్ 27శాతం కంటే తక్కువ ఫిట్మెంట్ (23.29 శాతం) ప్రకటించిన సర్కారు... ఇప్పుడు హెచ్ఆర్ఏ, సీసీఏ, డీఏల్లోనూ ఉద్యోగులకు ఝలక్ ఇచ్చింది. క్వాంటమ్ పెన్షన్లలోనూ ఒక శ్లాబు ఎత్తేసింది. దీంతో పీఆర్సీతో పెరగాల్సిన ఉద్యోగుల వేతనాలు 'రివర్స్' గేరు వేశాయని అయన అన్నారు.

# తెలుగు జాతికి ప్రపంచఖ్యాతి తీసుకువచ్చిన మహనీయుడు ఎన్టీఆర్

### నందిగామ పట్టణంలో ఘనంగా ఎన్టీఆర్ 26 వ వర్ధంతి కార్యక్రమాలు

### కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య

నందిగామ జనవరి18 తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మహనీయుడు కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకు దక్కుతుందని తంగిరాల సౌమ్య అన్నారు. చందాపురం, నందిగామ పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల కొరకు కూడు గూడు గుడ్డ ఉండాలని ఉద్దేశంతో పార్టీని స్థాపించి పేదల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన ఆదర్శ నీయులు ఎన్టీఆరని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళు తున్న నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరిచి వచ్చే ఎన్నికల్లో మనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. రైతు పేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపును తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బ్రతకలేక ఒప్పుకున్నాం....బ్రతిమిలాడుకొనే స్థితికి వచ్చాం

### పడమటి నాయుడు పల్లి గ్రామస్తుల ఆవేదన అలకించండి

### జిల్లా కలెక్టర్ కె.ఎన్. చక్రధర్ బాబుకు గ్రామస్తుల విజ్ఞప్తి

మర్రిపాడు ఆనం సంజీవరెడ్డి సోమశిల హై లెవల్ లిఫ్ట్ ఇరిగేషన్ కెనాల్ ద్వారా సోమశిల నుండి మెట్ట ప్రాంతాలైనఉదయగిరికి,వింజమూరు మండలాలకు సాగు,తాగు నీటిని సరఫరా చేసి మెట్ట ప్రాంతాన్ని సస్యశామలం చేస్తారని మూడు రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు అందులో మర్రిపాడు మండలం పడమటి నాయుడు పల్లి గ్రామం లో మొదటి రిజర్వాయర్ ఏర్పాటు చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని సరఫరా చేసి మెట్ట ప్రాంతాలను డెల్టా ప్రాంతంగా మారుస్తారని ముంపు గ్రామంగా పడమటి నాయుడు పల్లి గ్రామాన్ని ప్రకటించారు ప్రభుత్వ అధికారులు. గ్రామంలో బ్రతుకు దెరువు లేని పడమటి నాయుడు పల్లి గ్రామస్తులు చుట్టూ అడవి ప్రాంతం రెండు కిలోమీర్ల దూరం నడిస్తేనే గాని జాతీయ రహదారి చేరలేని రవాణా సౌకర్యం ఊరికి అడ్డంగా కేతమన్నేరు వాగు వర్షాకాలం వస్తే వాగు ప్రవహిస్తే ప్రమాదమైన ప్రాణాలు పోగొట్టుకొనే పరిస్థితి చెరువు నిండనిదే పైరు పెట్ట లేని గతి ఇలాంటి పరిస్తితిలోబ్రతకలేక బ్రతుకు బారమనిపిస్తుందని గ్రామం వదిలి వెళ్లడానికి ఒప్పుకున్న గ్రామస్తులకు ముంపు గ్రామంగా ప్రకటించి తొమ్మిది సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకోకుండా అభిరుద్ధికి అమడదూరంలో అవస్థలు పడుతుంటే అధికారుల అలసత్వం పడమటి నాయుడు పల్లి గ్రామస్తులను ఆవేదనకు గురిచేస్తుంది.తొమ్మిది ఏండ్లుగా పడిపోని గుడిసె ఏదైనా ఉంటుందా ఉండదని అధికారులకు తెలుసు మరి గ్రామంలో ఉండే పేదవారు బీదలు పూరి గుడిసె వెనుకోవడానికి రెవిన్యూ అధికారులు పర్మిషన్ కావాలని నిబంధనలు విధించారు ఇంటిపై కప్పు వేసిన తలారి వచ్చి తహసీల్దార్ కు రిపోర్ట్ చేస్తున్నారు ఇల్లు కట్టవద్దని చెప్తున్నారు మరి తొమ్మిది సంవత్సరాలుగా పెళ్లిళ్లు అయిన పిల్లలు ఎంత మంది ?? ఉంటారు వారు నివసించడానికి సహజీవనం గడపడానికి వేరు కాపురం పెట్టడానికి పూరి పాకైనా కావాలికదా అలాంటి అవకాశమేలేకుండా కట్టు కట్టారు.అందరూ ఒకే ఇంటిలో కుములుతున్నారు. పొలాలను నమ్ముకొని ఆడ బిడ్డలకు పెళ్లిళ్లు చేసుకొనే పేద రైతులు గ్రామంలో ఉన్నారు గత తొమ్మిది సంవత్సరాలుగా పొలం కూడా అమ్ముకోని పెళ్లిళ్లు చేయలేక అమ్మే వీలులేక లోలోపల కుమిలిపోయే పరిస్థితి పేద రైతులకు ఏర్పడింది గ్రామంలో బహిరంగ మలవిసర్జన పథకం అమలు లేదు సిమెంట్ రోడ్లు నిర్మాణం లేదు, కొత్త కాలనీలు లేవు, ఒక్క మాటలో చెప్పాలంటే కొత్తగా వచ్చే గ్రామ అభిరుద్ధి పథకాలు లేవు అని బ్రతకలేక ముంపుకు ఒప్పుకున్నా...బ్రతిమిలాడుకొనే స్థితికి వచ్చామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకంటే ఆదర్శ పాలన అందిస్తూ సీఎం చేతనే శభాష్ అనిపించుకుంటు పాలన సాగిస్తున్న జిల్లా కలెక్టర్ కె.ఎన్. చక్రధర్ బాబు పడమటి నాయుడు పల్లి గ్రామస్తుల ఇబ్బందులను గమనించి ముంపు గ్రామంగా ప్రకటించిన ఈ గ్రామ ప్రజలకు మోక్షం కలిగేలా చూడాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## టీడీపీ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం

విశాఖపట్నం విశాఖ లో ఎన్టీఆర్ వర్ధంతి టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఆర్కే బీచ్ లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా పార్టీ ప్రధాన కార్యాలయం లో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. తెలుగు జాతి గర్వించదగ్గ నేత ఎన్టీఆర్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతి గొప్పతనాన్ని చాటి చెప్పిన మహా నేత అని అన్నారు.

### విపిజి ఫౌండేషన్ ఆధ్వర్యం లో సీసీ కెమెరాలు ఏర్పాటు

హైదరాబాద్ విపిజి ఫౌండేషన్ చైర్మన్ వజీర్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఓల్డ్ మారుతీ నగర్ చౌరస్తా నుండి కొత్తపేట మహిళా భవన్ వరకు రెండు లక్షల తొంబై వేల రూపాయలతో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాలను ఏసిపి శ్రీధర్ రెడ్డి తో కలిసి ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. నిందితులను పట్టుకోవడంలో, నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో ఉందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖకు అన్ని వసతులు సమకూర్చుతూ నేర నియంత్రణలో పోలీసులు ముఖ్యభూమిక పోషిస్తున్నారు అన్నారు.

## అమాత్య...భాగ్యం లేదా..?

విశాఖపట్టణం, జనవరి 18, విశాఖజిల్లాలో పార్టీ పటిష్టతపై వైసీపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. టీడీపీ రెబల్ ఎమ్మెల్యే కాకుండా ఇక్కడ అధికారపార్టీకి 11మంది శాసనసభ్యుల బలం ఉంది. మొదట్లో అంతా సవ్యంగానే ఉన్నట్టు కనిపించినా.. రెండున్నరేళ్లు తిరిగే సరికి పరిస్థితులు మారిపోయాయి. ఎమ్మెల్యేలకు ద్వితీయ శ్రేణికి మధ్య గ్యాప్ పెరిగింది. పాయకరావుపేట, విశాఖ దక్షిణ నియోజకవర్గాల్లో వ్యతిరేకత రోడ్డెక్కింది. మిగిలినచోట్ల చాపకింద నీరులా అసమ్మతి విస్తరిస్తోంది. ఈ ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కనిపించడంతో.. వైసీపీ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతంలో పార్టీ, కేడర్ బలంగా ఉన్నప్పటికీ నాయకత్వం మధ్య విభేదాలను సీరియస్గా పరిగణించి అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్కు కీలక బాధ్యతలు అప్పగించింది అధిష్ఠానంఎమ్మెల్యే అమన్నాథ్ను అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిని చేశారు. ఈ బాధ్యతలు అప్పగించడం వెనక బలమైన కారణాలు ఉన్నాయట. 2009 ఎన్నికల్లో అమర్నాథ్ అనకాపల్లి ఎంపీగా పోటీ చేశారు. వైసీపీ అధికారంలోకి రాకముందు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉంది. కాపు సామాజికవర్గానికి చెందిన నేత. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో కాపు నాయకత్వం బలం ఎక్కువ. వీటన్నింటినీ బేరీజు వేసుకునే హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక్కడి నుంచే ఆసక్తికరమైన చర్చ మొదలైంది.వాస్తవానికి అమర్నాథ్ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఎప్పుడు మంత్రివర్గ విస్తరణ జరిగినా బెర్త్ ఖాయమని ఎమ్మెల్యే అనుచరుల ధీమా. ఇంతలో పార్టీ బాధ్యతలు అప్పగించడంతో అనుచరులు డైలమాలో పడ్డారట. పార్టీ పదవిపై అమర్నాథ్ ఆలోచనలు ఎలా ఉన్నా.. కేడర్ మాత్రం తమ నేతకు మంత్రి పదవి ఉన్నట్టా.. లేనట్టా..? అని చెవులు కొరుక్కుంటోందట. డీలా పడిన వారికి ఎమ్మెల్యే సర్ది చెబుతున్నారట. చాలా జిల్లాల్లో మంత్రులే అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నందున కొత్త పదవిని పాజిటివ్ సంకేతంగా చూడాలనేది పార్టీలో మరోవర్గం అభిప్రాయం. మిగిలిన జిల్లాల మాదిరిగానే ఇక్కడ అధ్యక్షుడిగా ఉన్న అమర్నాథ్కు లక్ కలిసి వస్తుందనే చర్చ జరుగుతోంది. అందుకే ఎమ్మెల్యేకు వచ్చిన ప్రమోషన్ ఎంత వరకు లాభం.. ఏ మేరకు నష్టం..? అనే తూకం వేసుకుని విశ్లేషించుకునే పనిలో పడింది కేడర్.

## బీసీలు.. కాపులను దారికి తెచ్చుడు ఎలా

గుంటూరు, జనవరి18 చంద్రబాబుకు వారిద్దరూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. సెట్ అవుతుందనుకుంటున్న సవ ుయంలో ఏదో ఒక సమస్య వచ్చి పడుతూనే ఉంది. చంద్ర్ బాబుకు ఒక లె క్కంటూ ఉంది. ఆ లెక్క తప్పకూడదన్నదే ఆయన ప్రయ ుత్నం. గత ఎన్నికలలో కాపులు, బీసీలు దూరవ ుయ్యారు. దశాబ్ద ్దాలుగా టీడీపీ వెంట ఉన్న బీసీల్లో ఎక్కువ శాతం మందిని జగన్ ఎగురేసుకుపోయాడు. పెద్దపీటే వేస్తున్నారు. పదవులు, నామి నేటెడ్ పోస్టులు, కాంట్రాక్ట్ పనుల్లో వారికి అగ్రస్థానం కల్పి స్తున్నారు. దీంతో బీసీలను తిరిగి తమవైపునకు తిప్పుకోవాలని చంద్ర్ బాబు ప్రయత్నం చేస్తున్నా అది ఎంతవరకూ ఫలిస్తుందో తెలీదు. బీసీలు గతంలో మాదిరి గంపగుత్తగా మొగ్గు చూపుతారన్న నమ్మకం లేదు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కాపులకు ఐదు శాతం ఈబీసీ కోటాలో రిజర్వేషన్లను కల్పిస్తూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో బీసీల్లో ఆయన పట్ల వ్యతిరేకత మొదలయింది. తమది బీసీల పార్టీ అని ఎంతగా చెప్పుకున్నా చంద్రబాబును ఈసారి కూడా బీసీలు నమ్మరు. వైసీపీ వైపు అదే సమయంలో అధికార వైసీపీపై కాపు సామాజికవర్గం గుర్రుగా ఉంది. తమను పట్టించుకోవడం లేదని వారు భావిస్తున్నారు. మంత్రి పదవులు వంటివి ఇచ్చినప్పటికీ జగన్ కాపులకు చేసిందేమీ లేదన్న అభిప్రాయం బలంగా ఉంది. అదే సమయంలో కాపులు చంద్రబాబు వెంట కూడా నడిచే అవకాశం లేదు. వారు ఈసారి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వైపు చూసే అవకాశముంది. ఈ నేపథ్యంలో పవన్ ను కలుపుకుని పోయే ప్రయత్నం చంద్రబాబు మొదలు పెట్టారు. కానీ చంద్రబాబుకు ఇప్పుడు కాపు సామాజికవర్గానికి చెందిన ముద్రగడ పద్మనాభం, చిరంజీవి ఇబ్బందిగా మారారు. ముద్రగడ అయితే ఏకంగా ప్రత్యేక పార్టీ పెట్టే అవకాశముందంటున్నారు. అదే జరిగితే కాపు ఓట్లలో చీలిక తప్పదు. ఇక చిరంజీవి కూడా జగన్ ను పొగడటం, జగన్ కూడా చిరంజీవికి ప్రయారిటీ ఇవ్వడం వంటివి టీడీపీని ఇబ్బంది పెడుతున్నాయి. వీరిద్దరి కారణంగా పవన్ కు కూడా కాపులు దూరమవుతారన్న బెంగ పట్టుకుంది. మొత్తం మీద ఈ ఇద్దరూ చంద్రబాబుకు నిద్రలేకుండా చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

అనంతపురంసంక్రాంతికి సొంత ఊరికి వెళ్లి కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకుని ఈరోజు ఉదయం బెంగళూరుకు బయల్దేరి వెళ్లిన ఆ యువకుడిని మృత్యువు కబళించింది. అనంతపురం జిల్లా పెన్నహోబిలం వంతెనపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సిధార్థ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.ఉరవకొండ పట్టణానికి చెందిన సిద్దార్థ (24) బెంగళూరులోని ఓకంపెనీలో హార్డ్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు సొంత గ్రామానికి వచ్చిన ఆ యువకుడు తిరిగి బెంగళూరుకు తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పెన్నహోబిలం వద్ద పెన్నానది వంతెన పై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పీఆర్సీ జీవోలపై సచివాలయ ఉద్యోగుల తీవ్ర అసంతృప్తి

అమరావతి పీఆర్సీ జీవోలపై సచివాలయ ఉద్యోగుల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో రెండు గంటల పాటు సచివాలయ ఉద్యోగుల సంఘం సమావేశం అయింది. పీఆర్సీ జీవోలు జారీ చేసిన విధానంపై చర్చ కొనసాగింది. ఫిట్మెంట్, హెచ్చార్ఏలను భారీగా తగ్గించడంపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిరసన బాట పట్టాలని నిర్ణయం తీసుకున్నారు. బుధవారం నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేయాలని సచివాలయ ఉద్యోగులు నిర్ణయించారు. సచివాలయం ఫస్ట్ బ్లాకులో సీఎస్ సమీర్ శర్మను కలిసేందుకువారంతా ర్యాలీగా వెళ్లారు. భద్రతా సిబ్బంది కొందరిని మాత్రమే ఫస్ట్ బ్లాక్ వద్దకు అనుమతించారు.పీఆర్సీ జీవోలను రోల్ బ్యాక్ చేయాలని సెక్రటేరియేట్ ఉద్యోగుల డిమాండ్ చేస్తున్నారు. సీఎస్ అందుబాటులో లేకపోవడంతో పేషీలో రిప్రజేంటేషన్ ఇచ్చారు.

# తెలుగు వారి గుండె చప్పుడు ఎన్టీఆర్

**టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస రెడ్డి మంత్రాలయంలో ఘనంగా స్వర్గీయ తారకరాముడి 26.వ. వర్ధంతి వేడుకలు**

మంత్రాలయం జనవరి 18, ( విభారె : తెలుగు వారి గుండె చప్పుడు శ్రీ స్వర్గీయ నందమూరి తారక రామారావు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, తెలుగు జాతి ముద్దు, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెసేతర తొలి ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి 26వ వర్ధంతి వేడుకల సందర్భంగా మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీనికేతన్ ఫంక్షన్ హాల్ నందు టిడిపి మండల నాయకులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ జాతీయ అధ్యక్షులు ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆదేశాల మేరకు స్వర్గీయ నందమూరి తారకరామారావుగారి 26వ వర్ధంతి వేడుకలకు మంత్రాలయం నియోజకవర్గ ఇంచార్జి పాలకుర్తి తిక్కారెడ్డి గారి సోదరుడు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మండల పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తల సమక్షంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెలుగు వారి గుండె చప్పుడు నందమూరి తారక రాముడు అని సమాజమే దేవాలయం ప్రజలే మా దేవుళ్ళు అని దేశ వ్యాప్తంగా చాటి చెప్పి, మన తెలుగు జాతికి కీర్తి ప్రతిష్టలకు వన్నె తెచ్చిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు గారు అని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం రావణకాష్టంలా మరిగి పోతున్నప్పుడు నియంత పాలన లో ప్రజలు మగ్గి పోతున్నప్పుడు భగవంతుడే మనిషి రూపంలో వచ్చి ప్రజలను కాపాడుతాడు అనడానికి పరిపాలిస్తాడు అనడానికి ఒక చక్కని ఉదాహరణ నిలువెత్తు నిదర్శనం నందమూరి తారక రామారావు అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో రాష్ట్రం అతలాకుతలం అయినప్పుడు ఆంధ్ర రాష్ట్ర ప్రజలను కాపాడటానికి తెలుగు జాతి ముద్దుబిడ్డ నందమూరి తారక రాముడు తెలుగుదేశం పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లోనే తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ప్రపంచ రాజకీయ చరిత్రలోనే అతి తక్కువ సమయంలోనే పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చి తాను ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించాడని అన్నారు. తెలుగువారందరికీ అనేక సంక్షేమ పథకాలతో పాటు పేదవారికి రెండు రూపాయలకే కిలో బియ్యం అందించిన ఘనత ఎన్టీఆర్ దేనని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ అంటే ప్రతి ఒక్క తెలుగు బిడ్డ పార్టీ అని చాటి చెప్పారు. పేద బడుగు బలహీన వర్గాల పార్టీగా తెలుగుదేశం పార్టీ అవతరించిందని అన్నారు. ఇప్పుడు కూడా జగన్మోహన్రెడ్డి అరాచక పాలనలో రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అప్పులపాలై ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, తెలుగు ప్రజలను కాపాడడానికి, రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించడానికి ,మళ్లీ తెలుగు రాజ్యంలో రామరాజ్యాన్ని తీసుకురావడానికి చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రం బాగు పడాలి అంటే తెలుగు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

## సచివాలయ మహిళా పోలీసులను హోం శాఖ పోలీసులుగా గుర్తింపు ఇవ్వాలి

**అడిషనల్ ఎస్పీ చిదానంద రెడ్డి కి వినతిపత్రం**

నంద్యాల జనవరి 18, ( విభారె) :- నంద్యాల పట్టణంలో సోమవారం నాడు సచివాలయంలో పనిచేస్తున్న మహిళా పోలీసులను హోం శాఖ పరిధిలోనే కొనసాగించాలని నంద్యాల అడిషనల్ ఎస్పీ చిదానంద రెడ్డి కి సచివాలయ మహిళా పోలీసులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు . మమ్ములను హోం శాఖ పరిధిలోనే కొనసాగించాలని ట్రైనింగ్ కూడా హోం శాఖ ద్వారా జరిగిందని కావున మహిళా పోలీసులను హోం శాఖ పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. మేము సచివాలయం యందు సక్రమంగా నిధులు నిర్వహిస్తూ మా పరిధిలో జరుగుతున్న సంఘటనలు ఎప్పటికప్పుడు హోం శాఖ పోలీసులకు చేరవేస్తున్నామని తెలిపారు. కావున ప్రభుత్వం వారు పునరాలోచించి మమ్ములను హోం శాఖ పరిధిలో కలుపు కోవాలని కోరుతున్నామని తెలిపారు.



## రాంపురం దేవర ఉత్సవాలకు పలువురు నాయకులు రాక

తుగ్గలి: జనవరి 18, ( విభారె మండల పరిధిలోని రాంపురం గ్రామంలోని సుంకులమ్మ అవ్వ మరియు పెద్దమ్మ అవ్వల గ్రామ దేవరను గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం రోజున జరుగు దేవర ఉత్సవాలకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని వైయస్సార్ సిపి నాయకులు గంగాధర్ మరియు బద్రి లు తెలియజేశారు. అదేవిధంగా బుధవారం రోజున జరుగు గ్రామ దేవరకు మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి హాజరవుతున్నట్లు ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి,పెండేకల్ భాస్కర్ రెడ్డి లు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు,కార్యకర్తలు మరియు కోట్ల అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు తెలియజేశారు.అదేవిధంగా బుధవారం రోజున జరుగు రాంపురం దేవర కార్యక్రమానికి పత్తికొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ కేఈ శ్యాంబాబు హాజరవుతున్నట్లు తుగ్గలి మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు రాంపురం వెంకట రాముడు చౌదరి తెలియజేశారు. రాంపురం దేవర కార్యక్రమానికి భక్తులందరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ ప్రజలు మరియు పెద్దలు తెలియజేశారు.

# శరీరానికి ప్రతి రక్తపు బొట్టు చాలా అవసరం...




రక్తదానం గొప్ప బహుమతి అని చాలా మంది వింటుంటారు. అవును, ప్రతి చుక్క రక్తం ఒక జీవితాన్ని కాపాడుతుంది. ప్రాణాలను రక్షించే సాధనంగా సురక్షితమైన రక్తదానం అవసరం గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం జూన్ 14 న ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ కోవిడ్ మహమ్మారి సమయంలో, చాలా మంది రోగుల ఆరోగ్యం మరియు జీవన నాణ్యతను మెరుగుపరచడంలో రక్తదాతల పాత్ర అంత తక్కువ కాదు. కరోనా వైరస్ మహమ్మారి అంటువ్యాధి సమయంలో కూడా, రక్తదాతలు అవసరమైన రోగులకు రక్తం మరియు ప్లాస్మాను దానం చేస్తూనే ఉన్నారు. అత్యవసర సమయాల్లో సురక్షితమైన మరియు అవసరమైన రక్త సరఫరాను నిర్ధారించడానికి కట్టుబడి ఉన్న ఈ తరం సేవలు చాలా బాగుంది. ఈ వ్యాసంలో మీరు ప్రపంచ రక్తదాత దినోత్సవం ప్రాముఖ్యత, చరిత్ర మరియు సందేశం గురించి తెలుసుకుందాం. రక్తదాన దినం 2021 రక్తదాన దినం 2021 స్వచ్ఛంద రక్తదానం ఆవశ్యకత మరియు కీర్తి గురించి ప్రజలలో అవగాహన పెంచడం మరియు వారి ప్రాణాలను కాపాడటానికి జీతం లేకుండా జీవితాలను దానం చేసిన వారిని గౌరవించడం అనే ఉద్దేశ్యంతో జూన్ 14 ప్రపంచవ్యాప్తంగా రక్తదాన దినోత్సవంగా జరుపుకుంటారు. అదనంగా, రక్తదానం మరియు రక్తం పొందటానికి సురక్షితమైన మార్గాల గురించి ప్రజారోగ్య రంగంలో అవగాహన పెంచడానికి ఈ రోజు ఉపయోగించబడుతోంది. కరోనా నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి మీరు ఖాళీ పొట్టతో ఏ పదార్థాలు తినాలో మీకు తెలుసా?కరోనా నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి మీరు ఖాళీ పొట్టతో ఏ పదార్థాలు తినాలో మీకు తెలుసా? రక్తదాన దినోత్సవ చరిత్ర రక్తదాన దినోత్సవ చరిత్ర ఈ రోజును ప్రపంచ ఆరోగ్య సంస్థ జూన్ 14, 2005 న మొదట నిర్వహించింది. జూన్ 14 రక్త సమూహాలను గుర్తించిన కార్ల్ ల్యాండ్‌స్టీనర్ జన్మదినం. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ సమాఖ్య రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ సొసైటీల సహకారంతో, ఈ రోజును జూన్ 14, 2004 న జరుపుకునే ఆలోచనతో ముందుకు వచ్చింది. మే 2005 లో, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తన 192 సభ్య దేశాలతో 58 వ ప్రపంచ ఆరోగ్య సభలో రక్తదాత దినోత్సవాన్ని అధికారికంగా ఏర్పాటు చేసింది. అప్పటి నుండి, రక్తదానం ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా వివిధ రక్తదాతలకు కృతజ్ఞతలు తెలిపే రోజును జరుపుకుంటారు. శరీరానికి విటమిన్ బి 12 అవసరం; దాని వల్ల ప్రయోజనాలు ఏంటో తెలుసా? ఆక్సిజన్ లెవల్స్ ను పెంచే విటమిన్ 12 ఫుడ్స్శరీరానికి విటమిన్ బి 12 అవసరం; దాని వల్ల ప్రయోజనాలు ఏంటో తెలుసా? ఆక్సిజన్ లెవల్స్ ను పెంచే విటమిన్ 12 ఫుడ్స్ రక్తదాన దినోత్సవం 2021 సందేశం రక్తదాన దినోత్సవం 2021 సందేశం ఈ సంవత్సరం రక్తదాన దినోత్సవం యొక్క ముఖ్య సందేశం 'రక్తదానం చేయండి మరియు ప్రపంచాన్ని ఉత్సాహంగా ఉంచండి'. ఇది ప్రపంచ మోక్షానికి రక్తదాతల సహకారాన్ని హైలైట్ చేస్తుంది. రక్తదానం చేసేవారు ప్రాణాలను రక్షించడంలో మరియు రోగి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. వర్షాకాలంలో ఈ వ్యాధుల నుండి జాగ్రత్తలు తీసుకోవాలివర్షాకాలంలో ఈ వ్యాధుల నుండి జాగ్రత్తలు తీసుకోవాలి రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యత రక్తదాన దినోత్సవం ప్రాముఖ్యత చాలా దేశాలలో, రక్తహీనత అనేది సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్య. ప్రధాన పరిష్కారం రక్తదానం. ముఖ్యంగా కోవిడ్ 19 సమయంలో, ప్లాస్మా మరియు రక్తదానం మహమ్మారి వైరస్ బారిన పడినవారికి దారిచూపింది. ఇది చాలా మంది ప్రాణాలను కాపాడుతుంది. ఈ సంవత్సరం హోస్ట్ చేయండి ఈ సంవత్సరం హోస్ట్ చేయండి ఈ సంవత్సరం, ప్రపంచ రక్తదాత దినోత్సవం గ్లోబల్ ఈవెంట్ జూన్ 14, 2021 న రోమ్‌లో జరుగుతుంది. దీనిని నేషనల్ బ్లడ్ సెంటర్ ద్వారా ఇటలీ నిర్వహిస్తుంది. ఎవరు రక్తదానం చేయవచ్చు? ఎవరు రక్తదానం చేయవచ్చు? 18 మరియు 55 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారి నుండి రక్తాన్ని స్వీకరించడం మంచిది. ఆరోగ్యకరమైన వ్యక్తి ఒక సమయంలో 450 మి.లీ వరకు రక్తాన్ని దానం చేయగలడని అంచనా. సూక్ష్మక్రిములు రక్తం ద్వారా సంక్రమించే అవకాశం ఉంది. అందువల్ల, సమర్థవంతమైన రక్త పరీక్షల తర్వాతే రక్తాన్ని దానం చేయాలి. రక్తదానం చేయడం ద్వారా, దాత శరీరంలో కొత్త రక్త కణాలు పెరుగుతాయి మరియు శరీరం మరింత చురుకుగా మరియు రిఫ్రెష్ అవుతుంది.

### కోహ్లి సెంచరీ కొడతాడు... ఇండియాదే వన్డే సిరీస్: ప్రొటీస్ మాజీ బౌలర్

దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి కచ్చితంగా సెంచరీ సాధిస్తాడని ప్రొటీస్ మాజీ బౌలర్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. సౌతాఫ్రికా పిచ్‌లు అతడికి అనుకూలిస్తాయని... కోహ్లి శతక్కొట్టడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశాడు. కాగా రన్‌మెషీన్‌గా పేరొందిన కోహ్లి... సెంచరీ కొట్టి రెండేళ్లు అవుతోంది. దక్షిణాఫ్రికాతో మూడో టెస్టులో ఈ ఆశ తీరుతుందని భావించిన అభిమానులకు నిరాశే ఎదురైంది.పట్టుదలగా నిలబడిన కోహ్లి తొలి ఇన్నింగ్స్‌లో 79 పరుగులకే అవుట్ కావడంతో భంగపాటు తప్పలేదు. ఇక టెస్టు సిరీస్‌లో పరాజయం తర్వాత టెస్టు కెప్టెన్సీకి గుడ్ బై చెప్పడంతో భారత జట్టు సారథిగా కోహ్లి ప్రస్థానం ముగిసిన నేపథ్యంలో కోహ్లికి ఇదే తొలి మ్యాచ్. ఈ నేపథ్యంలో స్టార్ స్పోర్ట్స్ షో లో మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఈ మేరకు... “విరాట్ కోహ్లి కచ్చితంగా వంద కొడతాడు. ముఖ్యంగా కేప్‌టౌన్‌లో బ్యాటింగ్ చేయడాన్ని అతడు ఆస్వాదిస్తాడు.

# మాస్ మహారాజా ఊర మాస్ లుక్ అదుర్స్




మాస్ మహారాజా రవితేజ మునుపెన్నడూ లేని విధంగా సినిమాల పరంగా స్పీడు పెంచేశారు. గత కొంత కాలంగా సరైన హిట్ మూవీ కోసం ఎదురు చూసిన ఆయనకు తాజాగా 'క్రాక్ ' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ లభించింది. గోపీచంద్ మలినేని తెరకెక్కించిన ఈ చిత్రం గత ఏడాది విడుదలై సంచలన విజయాన్ని సాధించడమే కాకుండా రవితేజ కెరీర్ లో భారీ వసూళ్లని రాబట్టిన చిత్రంగా నిలిచింది. ఈ మూవీ ఇచ్చిన సక్సెస్ తో రెట్టించిన ఉత్సాహంతో వున్న మాస్ మహారాజా రవితేజ వరుస చిత్రాలని లైన్ లో పెట్టారు.శుక్రవారం భోగి సందర్భంగా రవితేజ నటిస్తున్న ఊర మాస్ మసాలా యాక్షన్ ఎంటర్టైనర్ 'రావణాసుర' లాంఛనంగా మొదలైంది. సుధీర్ వర్మ డైరెక్ట్ చేస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ ఆర్ టి టీమ్ బ్యానర్ లపై అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఈ మూవీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రవితేజతో పాటు హీరోయిన్ లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నిచ్చారు. అంతకు ముందు రవితేజ మాస్ లుక్ కి సంబంధించిన న్యూ పోస్టర్ ని విడుదల చేశారు.ఊర మాస్ గెటప్ లో సిగర్ ని లైటర్ తో వెలిగిస్తూ మాసిన గడ్డంతో కనిపిస్తున్న రవితేజ మాసీవ్ లుక్ ఆకట్టుకుంటోంది. పవర్ఫుల్ మాస్ ఎంటర్ టైనర్గా రూపొందుతున్న ఈ మూవీలో రవితేజ లాయర్ గా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతున్నారు. మాస్రాజాకు ధీటైన పాత్రలో యంగ్ హీరో సుశాంత్ కనిపించబోతున్నారు. అంతే కాకుండా ఇందులో మాస్ రాజాతో ముగ్గురు క్రేజీ భామలు ఫరియా అబ్దుల్లా అను ఇమ్మాన్యుయేల్ మేఘా ఆకాష్ నటిస్తున్నారు.కీలకమైన లేడీ విలన్ గా పవర్ ఫుల్ పాత్రలో 'జాంబిరెడ్డి' ఫేమ్ దక్షా నాగర్ కర్ కనిపించబోతోంది. సరికొత్త నేపథ్యంలో రవితేజ నటవిశ్వరూపం చూపించనున్నీ ఈ మూవీని సెప్టెంబర్ 30న విడుదల చేయనున్నామని నిర్మాత ఈ సందర్భంగా వెల్లడించారు. తాజా పోస్టర్లో రవతేజ డ్రెస్ పై రక్తపు మరకలు చూస్తుంటే ఆయన పాత్ర కొంత నెగటివ్ టచ్ తో సాగుతుందని తెలుస్తోంది. అంతే కాకుండా రావణాసుడు అంటే పదితలల వాడు కాబట్టి సినిమాలో రవితేజ కూడా పది రకాల గెటప్ లలో కనిపించి సర్ప్రైజ్ చేయనున్నాడట.తాజా పోస్టర్ తో భారీ అంచనాలతో పాటు చాలా క్వశ్చన్స్ ని రైజ్ చేసిన 'రావణాసుర' ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో తెలియాలంటే సెప్టెంబర్ 30 వరకు వేచి చూడాల్సిందే. ఇదిలా వుంటే మాస్ మహారాజా ఊర మాస్ లుక్ చూసిన వారంతా లుక్ అదుర్స్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# అశోక్ గల్లా 'హీరో' కు తాత – మేనమామల ప్రశంసలు..!

సూపర్ స్టార్ కృష్ణ మనవడు మహేష్ బాబు మేనల్లుడు మరియు గుంటూరు ఎంపీ జయదేవ్ గల్లా కుమారుడు అశోక్ హీరోగా ఇండస్ట్రీలో అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో “హీరో” అనే టైటిల్ తో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రేపు శనివారం జనవరి 15 న విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ - ట్రైలర్ - సాంగ్స్ మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. తాజాగా 'హీరో' సినిమా చూసిన మహేష్ బాబు - కృష్ణ వీడియోల ద్వారా తన స్పందన తెలియజేశారు.మహేష్ మాట్లాడుతూ.. “హీరో సినిమా చూశాను. నాకైతే విపరీతంగా నచ్చేసింది. కష్టపడితే మంచి ప్రతిఫలం వస్తుందని నేనెప్పుడూ నమ్ముతాను. అశోక్ చాలా బాగా నటించాడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు.. ఆ కష్టం తెర మీద కనిపిస్తుంది. నాన్న గారికి సంక్రాంతి చాలా కలిసొచ్చింది.. ఆయన నటించిన సినిమాలు చాలా వరకు సంక్రాంతికి రిలీజ్ అయ్యి హిట్టు అందుకున్నాయి. అదే సెంటిమెంట్ నాక్కూడా కలిసి వచ్చింది. ఒక్కడు - సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు - సరిలేరు నీకెవ్వరూ ఇవన్నీ బ్లాక్ బస్టర్స్ అయ్యాయి. ఈ సంక్రాంతికి మా ఫ్యామిలీ నుంచి మరో హీరో పరిచయమవుతున్నాడు. నాన్నగారి అభిమానులు నా అభిమానులు అశోక్ ని సపోర్ట్ చేస్తారని.. 'హీరో' సినిమా పెద్ద హిట్ చేస్తారని కోరుకుంటున్నాను. అశోక్ మరియు శ్రీరామ్ ఆదిత్యతో పాటు మొత్తం చిత్ర బృందానికి అభినందనలు తెలుపుతున్నాను” అని పేర్కొన్నారు.అలానే కృష్ణ మాట్లాడుతూ.. “అశోక్ గల్లా హీరోగా తెరకెక్కిన చిత్రం జనవరి 15న విడుదలవుతోంది. నేను సినిమా చూసాను. నాకు ఎక్కడా బోర్ అనిపించలేదు. సబ్జెక్ట్ లో నావల్టీ ఉంది. ఇది వరకు ఇలాంటి సబ్జెక్ట్స్ రాలేదు. ఎక్కడా బోర్ కొట్టకుండా చాలా బాగా తీశారు. ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను. నా అభిమానులు మరియు మహేష్ ఫ్యాన్స్ సినిమా చూసి అశోక్ గల్లా మంచి ఆర్టిస్ట్ అయ్యేలా ప్రోత్సహించవలసిందిగా కోరుతున్నాను. తెలుగు ప్రేక్షకులకు సంక్రాంతి శుభాకాంక్షలు” అని అన్నారు.హీరోగా లాంచ్ అవుతున్న గల్లా అశోక్ కి.. సినిమా విడుదల ముందు మేనమామ మరియు తాత ఆశీస్సులతో పాటు మద్దతు లభించింది.

# ఏడేళ్ల తర్వాత తొలిసారి ఇలా.. అయినా అందరి చూపు అతనివైపే..!




పార్ల్: గత ఏడేళ్లుగా జట్టుకు ఎన్నో మరపురాని విజయాలనందించి.. ప్రపంచ క్రికెట్‌లో టీమిండియాను అగ్రస్థానంలో నిలబెట్టిన విరాట్ కోహ్లి చాన్నాళ్ల తర్వాత సాధారణ ఆటగాడిగా బరిలోకి దిగబోతున్నాడు. ఇప్పటివరకు కెప్టెన్ హోదాలో ఫీల్డింగ్ సెట్ చేస్తూ, సహచరులకు సూచనలు ఇస్తూ కనిపించిన కోహ్లి.. ఇకపై మైదానంలో మరో కెప్టెన్ మాట వినాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో అందరి చూపు కోహ్లిపైనే ఉండనంది. ాగా, దక్షిణాఫ్రికాతో రేపు జరగనున్న తొలి వన్డేలో కోహ్లి మరిన్ని విషయాల్లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలువబోతున్నాడు. దిగ్గజ క్రికెటర్లైన సచిన్, ద్రవిడ్, గంగూలీల రికార్డులకు అతి చేరువలో ఉన్నాడు. రేపటి మ్యాచ్‌లో శతకం సాధిస్తే, క్రికెట్ చరిత్రలో అత్యధి?క సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్(100) తర్వాతి స్థానానికి చేరుకోనున్న కోహ్లి(71).. ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానాన్ని షేర్ చేసుకుంటాడు. ఈ ఫీట్ ద్వారా భారత్-దక్షిణాఫ్రికా మధ్య వన్డేల్లో ఏబీ డివిలియర్స్(6) తర్వాత అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కనున్నాడు. ప్రస్తుతం కోహ్లి సఫారీలపై 5 వన్డే శతకాలు నమోదు చేశాడు. దక్షిణాఫ్రికాపై వన్డేల్లో 1287 పరుగులు చేసిన కోహ్లి.. మరో 27 పరుగులు చేస్తే.. ద్రవిడ్(1309), గంగూలీ(1313)లను అధిగమిస్తాడు. ఈ జాబితాలో సచిన్ 2001 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ రికార్డులతో పాటు కోహ్లిని మరో రికార్డు కూడా ఊరిస్తోంది. ఈ సిరీస్‌లో కోహ్లి(887) మరో 171 పరుగులు చేస్తే.. సఫారీ గడ్డపై సచిన్(1453), పాంటింగ్(1432) తర్వాత అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కనున్నాడు.అలాగే మరో 113 పరుగులు చేస్తే.. నాలుగు అంతకంటే ఎక్కువ దేశాల్లో 1000కిపైగా పరుగులు చేసిన మూడో భారత క్రికెటర్‌గా నిలుస్తాడు. భారత్‌లో 4994 పరుగులు చేసిన కోహ్లి, ఇంగ్లండ్‌లో 1316, ఆస్ట్రేలియాలో 1327 పరుగులు స్కోర్ చేశాడు. కాగా, కోహ్లి చివరిసారిగా అంతర్జాతీయ సెంచరీ సాధించి దక్షణాఫ్రికాతో తొలి వన్డే నాటికి 788 రోజులవుతోంది.

## 'క్యాచ్ పట్టేశావు.. భ్రమలో నుంచి బయటికి రా'

బిగ్‌బాష్ లీగ్‌లో భాగంగా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ స్టన్నింగ్ క్యాచ్‌తో మెరిశాడు. అయితే తాను క్యాచ్ పట్టేశానా అన్న విధంగా మ్యాక్సీ ఇచ్చిన హావభావాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయంలోకి వెళితే.. మెల్‌బోర్న్ స్టార్స్, బ్రిస్బేన్ హీట్ మధ్య మ్యాచ్ జరిగింది. ఇన్నింగ్స్ 16వ ఓవర్‌ను నాథన్ కౌల్టర్‌నీల్ వేశాడు. ఓవర్ నాలుగో బంతిని గుడ్‌లెంగ్త్‌తో వేయగా.. సామ్ హీజ్‌లెట్ మిడాఫ్ దిశగా ఆడాడు. అక్కడే ఉన్న మ్యాక్స్‌వెల్ వెనక్కి పరిగెట్టి.. డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు. మ్యాక్సీ విన్యాసాన్ని తోటి ఆటగాళ్లు సహా మైదానంలోని ప్రేక్షకులు ఎంజాయ్ చేయగా.. అతను మాత్రం క్యాచ్ అందుకున్నాన్నా అనే భ్రమలోనే ఉండిపోవడం విశేషం. దీనిపై అభిమానులు వినూత్నరీతిలో స్పందించారు. ' మ్యాక్సీ నువ్వు క్యాచ్ పట్టేశావు.. భ్రమలో నుంచి బయటికి రా' అంటూ కామెంట్స్ చేశారు.ఇక మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బ్రిస్బేన్ హీట్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది. బెన్ డకెట్ 51 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన మెల్‌బోర్న్ స్టార్స్ 13.5 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. జో క్లార్క్ 62 పరుగులతో రాణించగా.. మ్యాక్స్‌వెల్ 37 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

# జాకీతో రకుల్ అంతా పబ్లిక్ గానే

రకుల్ ప్రీత్ సింగ్- నిర్మాత జాకీ భగ్నానీ డేటింగ్ లో ఉన్న సంగతి తెలిసిందే. గత ఏడాది అక్టోబర్ 10న రకుల్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆ విషయాన్ని ఇన్ స్టా ద్వారా రివీల్ చేసింది. జాకీ చిత్రాన్ని పోస్ట్ చేసి దానికి థాంక్యూ మై లవ్ అని సింబల్ ని యాడ్ చేసింది. “మీరు ఈ సంవత్సరం అతి పెద్ద బహుమతి. నా జీవితాన్ని రంగుల మయం చేసినందుకు ధన్యవాదాలు“ అని ఆరసుకొచ్చింది. సాధారణంగా చాలా మంది జంటలు తమ సంబంధాన్ని దాచడానికి ప్రయత్నిస్తుండగా ఈ జంట మాత్రం ఎలాంటి దాపరికాలు లేకుండా పబ్లిక్ గా ప్రకటించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రకుల్ ని ఈ విషయంపై ప్రశ్నించగా..దాక్కుని ..రహస్యంగా పరిగెత్తే జంటలె ఎవరో అందరికీ తెలుసు. మేము ఇద్దరం అలాంటి వాళ్లకు దూరం. అలాంటి ఆలోచనలు కూడా మా మనసులోకి రానివ్వం. ఏ పనిచేసినా అది గౌరవంగా ఉండాలి. ప్రేమించుకోవడంలో తప్పేముందు. ఇందులో ఒకరికి ఒకరకి ఒకరం గౌరవం ఇచ్చిపుచ్చుకుంటాం' అని తెలిపింది. అలాగే ఈ ఏడాది పెళ్లి చేసుకుంటున్నట్లు కూడా మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీని గురించి ఏమంటారని ప్రశ్నించగా.. పెళ్లి సంగతి పక్కనబెడితే ఇలాంటి నాన్సెన్స్ మాత్రం ఎక్కడికి వెళ్లినా తప్పడం లేదు.నేను నా పని మీద తప్ప ఇంకే విషయాలపై శ్రద్ధ పెట్టలేదు. ఆలోచన కూడా చేయలేదు. నాజీవితంలో ఎంతో పారదర్శకంగా ఉన్నాను. ఆ సమయం వచ్చినప్పుడు ఎలా రాసి పెట్టి ఉంటే అలా జరుగుతుంది. ఇలాంటి విషయాల్లో ప్రేక్షకులకు ఊహగానాలు చేయకూడదు. ఏ విషయమైనా నాకు నేనుగానే వివరిస్తాను. ప్రస్తుతం నా దృష్టంతా కెరీర్ పైనే ఉంది. 10 సినిమాలు చేతిలో ఉన్నాయి. ఇంకా మరెన్నో పనులు బ్యాలెన్స్ ఉండిపోయాయి. ముందగా వాటన్నింటిని పూర్తిచేయాలని రకుల్ తెలిపింది.ఇక రకుల్ బాలీవుడ్ బిజీగా ఉంది. 'ఎటాక్'..'రన్ వే 34'..'థాంక్ గాడ్'..'డాక్టర్ జీ'..'మిషన్ సిండ్రెల్లా'..'ఛత్రివాలి'..'ఇండియాన్ -2' సినిమాల్లో నటిస్తోంది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190